

హెచ్‌ఆర్‌ఎ రద్దు, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ..

స్టీల్ ఇడి భవనం ముట్టడి

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 66 | విజయవాడ, ఆదివారం 6 అక్టోబర్2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, sunday 6 October 2024 | Rs



6

ఇరానీ కప్ విజేత ముంబయి

27ఏళ్ల నిరీక్షణకు తెర • 15వ సారి టైటిల్ కైవసం

'ఆన్‌లైన్' బెట్టింగ్‌కు
కుటుంబం బలి

తల్లిదండ్రులు, కుమార్తె మృతి
కుమారుడు పరిస్థితి విషమం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు (చిత్తూరు జిల్లా)

పెద్ద చదువులు చదివి, బాగా అభివృద్ధిలోకి వస్తాడనుకున్న కొడుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. ఉన్నదంతా ఇచ్చినా అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో ఆ కుటుంబం ఆత్మహత్యే శరణ్యమనుకుంది. తల్లిదండ్రులు, సోదరి ప్రాణాలు కోల్పోగా, ఆ యువకుడు చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో ఈ ఘటన సంచలనం కలిగించింది.



నాగరాజురెడ్డి (ఫైల్ ఫొటో)

స్థానికుల కథనం ప్రకారం... గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో నాగరాజురెడ్డి (61) తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. వ్యవసాయ పనులు, ప్రభుత్వం ఇచ్చే పింఛను డబ్బులతో ఆ కుటుంబం గుట్టుగా జీవనం సాగిస్తోంది. తన కొడుకు దినేష్‌ను చిత్తూరులో బిటెక్ చదివిస్తున్నారు. తన భార్య జయంతి (54)ని కొడుక్కి తోడుగా చిత్తూరు పంపించి, నాగరాజురెడ్డి గ్రామంలోనే ఉంటున్నారు. తల్లీకొడుకులిద్దరూ చిత్తూరులో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. నాగరాజురెడ్డి కుమార్తె సునీత (26) రాజస్థాన్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తూ మూడు నెలల క్రితం ఇంటికి వచ్చారు. దినేష్ 'ఆన్‌లైన్' బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. రూ.20 లక్షల వరకూ అప్పులు చేసినట్లు సమాచారం. నాగరాజురెడ్డి ముగ్గురు అన్నదమ్ములూ ఇటీవల ఆస్తి పంపకాలు చేసుకున్నారు. ఒక్కొక్కరికీ రూ.20 లక్షల చొప్పున ఆస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కొడుకు అప్పుల పాలయ్యాడని తెలిసి నాగరాజురెడ్డి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. కూతురు పెళ్లికి, ఇతర అవసరాలకు పనికొస్తాయనుకున్న రూ.20 లక్షలలో రూ.10 లక్షల వరకూ కొడుక్కి సర్దుబాటు చేశారు. మరికొంత డబ్బులు కావాలని తండ్రితో దినేష్ గొడవ పడ్డాడు. దీంతో, ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. చివరికి బలవన్మరణానికి పాల్పడాలని నిర్ణయించుకున్నారు. కుటుంబంలోని నలుగురూ పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగరాజురెడ్డి (61) శుక్రవారం రాత్రి చనిపోయారు. ఆయన భార్య జయంతి (54), వారి కుమార్తె సునీత శనివారం మరణించారు. వారి కుమారుడు దినేష్ (23) చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అందిన ఫిర్యాదు మేరకు సిఐ లక్ష్మీనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురి మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

'టాప్' లేచిపోతోంది!

బెంబేలెత్తిస్తున్న కూర'గాయాలు' • టమాటా, ఉల్లి, ఆలూ ధరలపై ఆర్‌బిఐ, క్రిసిల్ ప్రత్యేక అధ్యయనం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రజల జీవన ప్రమాణాలు, నిత్యావసర వస్తువుల ధరల అదుపునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు భిన్నమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొంది. 'ధరల పెరుగుదల వాస్తవమే'నని పేర్కొంటూ కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ ఒక నివేదిక రూపొందించిన సంగతి తెలిసిందే. తాజాగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా మరింత విస్తృతంగా అధ్యయనం చేసి, ఒక నివేదిక విడుదల చేసింది. రిజర్వుబ్యాంకుకు చెందిన ఎకానమిక్ అండ్ పాలసీ రీసెర్చి విభాగం టమాటో, ఉల్లి (ఆనియన్), ఆలు (పొటాటో) ధరలపైనే కేంద్రీకరించి ఈ అధ్యయనం చేయడం విశేషం. ఆంగ్ల భాషలో ఈ మూడింటి మొదటి అక్షరాలను కలిపి (టిఒపి-టాప్)గా ఆర్‌బిఐ పేర్కొంది. కొన్ని సంవత్సరాలుగా 'టాప్' ధరలు చుక్కలు దాటి ఎలా పరుగులు తీస్తున్నాయో ఈ నివేదికలో వివరించారు. గత ఏడాది ఆగస్టు నుండి ఈ ఏడాది ఆగస్టు వరకు వీటి ధరల్లో సగటున 30 శాతం పెరుగుదల నమోదైనట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. 'క్రిసిల్ ఎంఐ అండ్ ఎ' సెప్టెంబర్ నెలాఖరు వరకు చేసిన మరో అధ్యయనంలో ఏడాది కాలంలో టమాటా 18శాతం, ఉల్లి 50శాతం, ఆలూ 53 శాతం ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయి. ఈ రెండు నివేదికలు కూడా వీటి ధరలు ఇప్పుడిప్పుడే తగ్గే అవకాశం లేదనే సంకేతాలు ఇస్తుండటం సామాన్యుడికి శరాఘాతమే!



ఆర్‌బిఐ అధ్యయనంలో ...

ఆర్‌బిఐ అధ్యయన నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదలలో టమాటా, ఉల్లి, ఆలూ ధరలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. సాధారణంగా కూరగాయల ధరలు పెరిగితే ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని, కూరగాయల ధరల్లోనూ ఈ మూడింటి ప్రభావమే ఎక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. గత ఏడాది జులై, ఆగస్టు, నవంబర్, డిసెంబర్‌లలో ఆహార ద్రవ్యోల్బణం అత్యధికంగా నమోదు కాగా, ఆ అన్ని నెలల్లో కూరగాయల ద్రవ్యోల్బణం అధికంగా నమోదైంది. అదేవిధంగా కూరగాయల ధరలు దేశ వ్యాప్తంగా అత్యధికంగా నమోదైన నెలల్లో టమాటో, ఉల్లి, ఆలూ ధరలు గణనీయంగా తగ్గాయని, వీటి ధరలు తక్కువగా ఉన్న సమయంలో కూరగాయల ద్రవ్యోల్బణం కూడా తక్కువగానే ఉందని పేర్కొంది. ఉల్లిపాయల ధరలు సెప్టెంబర్ - డిసెంబర్ మధ్యకాలంలో అత్యధికంగా పెరుగుతున్నాయని, ఆలూ ధరలు అక్టోబర్-నవంబర్ నెలల్లో గరిష్ట స్థాయికి చేరుతున్నాయని పేర్కొన్నారు. టమాటా ధరలు ఒక సంవత్సరం పెరిగితే, మరో సంవత్సరం తగ్గుతున్నాయని ఆర్‌బిఐ పేర్కొంది. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు టమాటా ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపింది.

క్రిసిల్ నివేదికలో ...

క్రిసిల్ నివేదిక ప్రకారం శాఖాహార భోజనం ఖరీదు ఏడాదికేడాదికి గణనీయంగా పెరుగుతోంది. గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇళ్లలో చేసుకునే శాఖాహార భోజనం ఖర్చు 11 శాతం పెరిగిందని, అదే హోటళ్లు, రెస్టారెంట్లలో 31.3 నుండి 37 శాతం దాకా ఈ పెరుగుదల ఉందని పేర్కొంది. టమాటా, ఉల్లి, ఆలూ ధరలు భారీగా పెరగడమే ఈ పరిస్థితికి కారణమని వివరించింది. ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రల్లో భారీ వర్షాల కారణంగా మార్కెట్లోకి డిమాండ్ మేరకు ఇవి రాలేదని, ధరలు ఈ స్థాయిలో పెరగడానికి ఇదే కారణమని పేర్కొంది. శాఖాహార భోజనంలో 9శాతంగా ఉండే పప్పుల ధరలు కూడా ఈ ఏడాది కాలంలో 14శాతానికి పెరిగాయని తెలిపింది.

సరైన కూలి లేదు... వసతీ లేదు

- శ్రమ దోపిడీకి పాల్పడుతున్న కాంట్రాక్టర్లు
- దసరా మహోత్సవాల్లో తాత్కాలిక పారిశుధ్య కార్మికుల ఇక్కట్లు

3లో..

నలుగురు చిన్నారులు మృతి

- నీటి గుంతలో పడి ముగ్గురు, పురుగు మందు తాగి ఒకరు

2లో..

తిరుమల పవిత్రతను కాపాడాలి

- విఐపి సంస్కృతి తగ్గాలి
- టిటిడి అధికారుల సమీక్షలో సిఎం చంద్రబాబు
- వకుళమాత వంటశాల ప్రారంభం

3లో..



ఇండియా బ్లాక్ హవా!

హర్యానాలో కాంగ్రెస్‌కే పట్టం • జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌సిపి-కాంగ్రెస్ ఫోరానికి ఛాన్స్ • ఎగ్జిట్ పోల్స్ అంచనా

న్యూఢిల్లీ : కేంద్రంలోని నయవంచక బిజెపి ప్రభుత్వానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగలనుంది. హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల బిజెపికి పరాభవం తప్పదని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పడిపోయి సొంతంగా మెజార్టీ కోల్పోయిన సంగతి తెలిసిందే. రైతు ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగించి ఛీత్కారాలు ఎదుర్కొన్న కాషాయ కూటమికి ఇక్కడ నూకలు చెల్లితే, రేపు మహారాష్ట్రలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. శనివారం నాడు హర్యానా పోలింగ్ ముగిసిన వెంటనే పలు సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ఇండియా ఫోరంలోని పార్టీలకే జై కొట్టాయి.

హర్యానాలో హస్తం

90 అసెంబ్లీ నియోజకవర్గాలున్న హర్యానాలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మ్యాజిక్ ఫిగర్ 46 సాధించాలి. మెజార్టీ సర్వే సంస్థలు కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ వస్తుందని చెప్పాయి. దేశ రాజధానిని అనుకుని వున్న హర్యానాలో పీఠాన్ని కైవసం చేసుకోవడానికి బిజెపి, కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డాయి. అయితే చారిత్రాత్మక రైతాంగ ఉద్యమం తన తడాఖాను చాటుకోనుంది. అంతేకాదు, పారిస్ ఒలింపిక్స్ మహిళల కుస్తీ ఫైనల్లో వినేశ్ ఫొగాట్‌కు పతకం దక్కకుండా చేయడంలోను, రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్, బిజెపి ఎంపీ, బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడిన రెజ్లర్లను ఢిల్లీ నడివీధుల్లో పోలీసులు ఈడ్చుకెళ్లడం, ఈ ఉదంతంలో బ్రిజ్ భూషణ్‌ను మోడీ ప్రభుత్వం వెనకేసుకురావడం వంటి వాటిపై ఆగ్రహంగా ఉన్న జాట్లు బిజెపికి పూర్తిగా దూరమైనట్లు తెలుస్తోంది. ఫొగాట్ కాంగ్రెస్ పార్టీ తరపున ఈ ఎన్నికల్లో పోటీ చేసిన సంగతి తెలిసిందే. . దీంతో పాటు అధిక ధరలు, నిరుద్యోగం సమస్యలు బిజెపిని బోనులో నిలబెట్టేలా చేశాయి.

జమ్ముకాశ్మీర్‌లో..

జమ్ముకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర హోదా తొలగింపు తర్వాత తొలిసారిగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికల్లో ఏ పార్టీ కూడా సొంతంగా సాధారణ మెజారిటీకి అవసరమైన 46 స్థానాలు పొందే అవకాశాలు లేవని ఎగ్జిట్ పోల్స్ అంచనా. అయితే జమ్మూకాశ్మీర్లో కలిసి పోటీ చేసిన ఇండియా ఫోరంలోని నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ పార్టీలు 46 నుంచి 50 వరకు స్థానాలను మిగతా 2లో

హర్యానాలో..

పీపుల్స్ పల్స్ సర్వే : కాంగ్రెస్ 55 బిజెపి 26, ఐఎన్‌ఎల్‌డి 2-3, జెజెపి 0-1, ఇతరులు 3-5

రిపబ్లిక్ మ్యాట్రిజ్: కాంగ్రెస్ 55-62, బిజెపి 18-24, ఐఎన్‌ఎల్‌డి ప్లస్ బిఎస్‌పి 3-6, జెజెపి 0-3, ఇతరులు 2-5

ధ్రువ్ రీసెర్చ్: కాంగ్రెస్ 57-64, బిజెపి 27-32, ఇతరులు 5-8

దైనిక్ భాస్కర్: కాంగ్రెస్ 44-54, బిజెపి 19-29, జెజెపి 0-1, ఐఎన్‌ఎల్‌డి 1-5, ఇతరులు 4-9

పి-మార్క్ : కాంగ్రెస్ ప్లస్ 44-54, బిజెపి 15-29, జెజెపి 0, ఐఎన్‌ఎల్‌డి 3-6, ఇతరులు 0

జమ్ముకాశ్మీర్‌లో..

పీపుల్స్ పల్స్ : ఎన్‌సిపి -కాంగ్రెస్ 46-50, బిజెపి 23-27, జెకెడిపి 7-11, ఎఐపి 0-1, ఇతరులు 4-5

రిపబ్లిక్ మ్యాట్రిజ్ : ఎన్‌సిపి - కాంగ్రెస్ 27, పిడిపి 28, బిజెపి 25, ఇతరులు : 7

దైనిక్ భాస్కర్ : ఎన్‌సిపి-కాంగ్రెస్ 35-40, పిడిపి 4-7, బిజెపి 20-25, ఇతరులు 12-16

ఇండియా టుడే - సీ ఓటర్ : ఎన్‌సిపి -కాంగ్రెస్ : 40-48, పిడిపి 6-12, బిజెపి 27-32, ఇతరులు 6-12

ఎన్నికల బాండ్లపై తీర్పు
తిరగదోడే ప్రసక్తే లేదు

- పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తిరగదోడే ప్రసక్తే లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆ తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శనివారం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. న్యాయవాది మాథ్యూస్ నెడుంపరా, మరొకరు ఈ పిటిషన్లు వేశారు. 'రివ్యూ పిటిషన్లను పరిశీలించిన మీదట రికార్డులో ఎలాంటి పొరపాటు లేదని కనిపిస్తోంది. సుప్రీం కోర్టు నియమావళి-2013లోని ఒకటో క్లాజ్‌లోని 47వ నిబంధన కింద తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు. అందువల్ల రివ్యూ పిటిషన్లను తోసిపుచ్చుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో అజ్ఞాత ఎన్నికల బాండ్ల పథకానికి మార్గం సుగమం చేస్తూ ద్రవ్య చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టం, కంపెనీల చట్టం, ఆదాయపన్ను చట్టాలకు చేసిన 2018 సవరణలు రాజ్యాంగ విరుద్ధమంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజకీయ పార్టీలకు వచ్చే నిధులు, విరాళాలు ఎక్కడ నుండి వస్తున్నాయో తెలుసుకునే ప్రాథమిక హక్కు ఓటరుకు వుందని, ఈ పథకం ఆ హక్కును కాలరాస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్లు జారీ చేసే భారతీయ స్టేట్‌బ్యాంక్ వెంటనే బాండ్ల కొనుగోలుదారులు, తీసుకున్నవారి వివరాలను వెల్లడించాలని కూడా కోర్టు ఆదేశించింది.. ఎన్నికల బాండ్ల పథకం బిజెపి రాజకీయ మిగతా 2లో

గాజాలో ఇజ్రాయిల్ దాడులు ఆపాలని
7న సంఘీభావ సదస్సు

- వామపక్ష పార్టీల ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులు, యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ జరిపి ఘర్షణలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఉదయం పదిగంటలకు సంఘీభావ సదస్సు జరగనుంది. ఈ మేరకు వామపక్ష పార్టీలు ఒక ప్రకటన విడుదల చేశాయి. పది వామపక్ష పార్టీలు జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరగనుంది. గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ దాడికి ప్రతీకార దాడి పేరుతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై విచక్షణారహితంగా క్రూరమైన దాడులకు దిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల కారణంగా 42 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలు మరణించారని వామపక్షాలు తెలిపాయి. వీరిలో మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నాయి. వాస్తవానికి మరణించిన వారి సంఖ్య 85 వేలకు పైగానే ఉంటుందని మరో అంచనా ఉందని తెలిపాయి. కాల్పుల విరమణకోసం జరుగుతున్న అర్థవంతమైన అన్ని చర్చలను ఇజ్రాయెల్ తొక్కేస్తూ మరోవైపు ఏడాది పొడగునా దాడి కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా ఈ నెల 7వ తేదీన జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని ప్రజలకు వామపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి.

ప్రారంభం కాని పత్తి కొనుగోలు

- విస్తీర్ణం తగ్గినా పెరగని ధర
- పెరిగిన పెట్టుబడులతో అల్లాడుతున్న రైతులు

2

ప్రభుత్వ విద్యే కావాలి !

5

- అర్జెంటైనాలో విస్తరిస్తున్న ఆందోళనలు • విశ్వవిద్యాలయాల రద్దుకు వ్యతిరేకంగా ర్యాలీలు



విద్యకు తగినన్ని నిధులు కేటాయించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ వీధుల్లోకి వచ్చిన నిరసనకారులతో కిటకిటలాడుతున్న బ్యూనస్‌ఎయిర్స్ సెంటర్



టిటిడిలో రివర్స్ టెండరింగ్ రద్దు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో రివర్స్ టెండరింగ్ విధానం రద్దయింది. ఈ మేరకు టిటిడి ఇఒ శ్యామలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన ముగిసిన వెంటనే ఇఒ ఈ మేరకు ప్రకటన చేశారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2019లో వైసిపి సర్కార్ తీసుకొచ్చిన ఇఒ 67ని రద్దు చేస్తూ గత నెల 16న చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేసి.. పాత టెండరింగ్ విధానాన్నే అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు టిటిడి కూడా అదే విధానాన్ని అనుసరిస్తూ చర్యలు చేపట్టింది.



రామరాజును అభినందిస్తున్న హోంమంత్రి అనిత

ప్రతి నియోజకవర్గంలో ఎపిఐఐసి ద్వారా పరిశ్రమలు

- మంతెన రామరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎపిఐఐసి ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు స్పష్టం చేశారు. మంగళగిరి ఎపిఐఐసి కార్యాలయంలో శనివారం ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా సంస్థ అభివృద్ధికి కృషిచేస్తానని మంతెన రామరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. రామరాజును హోంమంత్రి అనిత అభినందించారు.

62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగింపు

- హైకోర్టు ఆదేశంతో ముగ్గురు తుడ ఉద్యోగులకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడ)లో పనిచేసే ముగ్గురు ఉద్యోగుల సర్వీసు 62 ఏళ్లు పూర్తయ్యే వరకూ సర్వీసులో కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. ఉద్యోగుల పదవీ విరమణ వయసు వ్యవహారంపై రూల్స్ ఏమైనా రూపొందించారో లేదో చెప్పాలని జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి ఇటీవల తుడను ఆదేశించారు. 60 ఏళ్లు పూర్తయ్యేనాటికి పదవీ విరమణ చేయాలని తుడా వైస్ ఛైర్మన్ గతేడాది అక్టోబర్ నాటి ఉత్తర్వులను పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లని, తుడ ప్రభుత్వంలో భాగం కాబట్టి పిటిషనర్లకు కూడా అదేవిధంగా అమలు చేయాలని తిరుపతికి చెందిన వై.కృష్ణ శ్రీనివాసులు సహా ముగ్గురు పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. 2022 జనవరి 31న ప్రభుత్వం జారీచేసిన జీఓ 15 పరిగణనలోకి తీసుకొని పిటిషనర్లను 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగనివ్వాలని రాష్ట్రప్రభుత్వం, తుడ ఛైర్మన్, ఉప ఛైర్మన్లను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

ఉత్తరాది సంస్థలకే నెయ్యి ఎందుకు ఇచ్చారు? : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల ప్రసాదానికి ఉపయోగించే నెయ్యి టెండర్లను గత ప్రభుత్వం ఉత్తర భారతదేశానికి చెందిన సంస్థలకే ఎందుకు అప్పగించిందని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ అనేది బోగస్ అని, ఆ పేరుతో అప్పటి టిటిడి బోర్డు పెద్దలు కాంట్రాక్టర్ల నుంచి అడ్డంగా దోచేశారని అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టెండర్లు దక్కించుకున్న ఉత్తరాది సంస్థలు మార్కెట్ కంటే 40-50 శాతం ధర తగ్గించి ఎలా సరఫరా చేశాయని ప్రశ్నించారు. ఆంధ్ర-తెలంగాణ రైతుల కో-ఆపరేటివ్ సంస్థలను ఉద్దేశపూరితంగా పక్కనపెట్టారని అన్నారు. నిబంధనలకు ఇష్టానుసారం మార్చి అర్హత లేని ఎఆర్ డెయిరీకి టెండర్లు ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు. ఐదేళ్లల్లో వెయ్యి కోట్లకుపైగా టిటిడి కొనుగోళ్లలో ఈ సిండికేట్‌కు సుమారు రూ.250 కోట్లు కమీషన్లు ముట్టాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా లడ్డూ వ్యవహారంలో ఇంత గందరగోళం నడుస్తున్నా అప్పటి ఇఒ ధర్మారెడ్డి ఎక్కడ? అని ప్రశ్నించారు.

ఇండియా బ్లాక్ హవా!

(మొదటిపేజీ తరువాయి)

సాధించి ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వీలుంది. జెకెఎన్‌సి 33-35, కాంగ్రెస్ 13-15 స్థానాల్లో విజయం సాధించవచ్చునని వివిధ సంస్థలు పేర్కొన్నాయి. కాంగ్రెస్-జెకెఎన్‌సి మధ్య పొత్తు ఈ ఎన్నికల్లో కీలకంగా పనిచేసింది. దాదాపు 46 శాతం మంది కాంగ్రెస్-జెకెఎన్సి కూటమి తమ ప్రయోజనాలకు ఉత్తమంగా ఉపయోగపడుతుందని విశ్వసించారు. హిందువుల ఏకీకరణతో ప్రయోజనం పొందాలని మతత్వ పాచికలు వేసిన బిజెపికి జమ్మూ ప్రాంతంలోనే లబ్ధి చేకూరింది. జమ్మూలో కాంగ్రెస్ పేలవమైన ప్రచారం కూడా బిజెపి కి కొంత మేర కలిసొచ్చింది. అధిక ప్రచారంతో నిత్యం వార్తల్లో ఉన్న అవామీ ఇత్తేహాద్ పార్టీ (ఎఐపి) ఒక్క సీటుకే పరిమితమయ్యే వీలుందని తెలుస్తోంది. పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ వంటి చిన్న పార్టీలను కలుపుకొని మొత్తంగా ఇతరులకు 4 నుండి 5 సీట్లు రావచ్చని సర్వేలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉన్నట్లు దాదాపు అన్ని సర్వేలు ఘోషించాయి. ఉపాధి కల్పన, ఆర్థికాభివద్ధి పరంగా ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్లను ఓటర్లు ఎత్తిచూపారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు విద్యుత్ చార్జీల పెరుగుదల, ఆశించిన అభివృద్ధి లేకపోవడం ఎన్నికల్లో కీలకాంశాలుగా మారాయి. జమ్ముకాశ్మీర్‌కు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇలా ఉన్నాయి.

హెచ్‌ఆర్‌ఎ రద్దు, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ..

స్టీల్ ఇడి భవనం ముట్టడి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

హెచ్‌ఆర్‌ఎ రద్దు, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ ఇడి బిల్డింగ్‌ను శనివారం ఉక్కు ఉద్యోగులు ముట్టడించారు. తమకు తక్షణమే హెచ్‌ఆర్‌ఎ ఇవ్వాలని, తమ క్వార్టర్స్‌లో పెంచిన కరెంట్ బిల్లులను తగ్గించాలని నినదించారు. ముట్టడి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు, వారి కుటుంబసభ్యులు తరలివచ్చారు. ఈ క్రమంలో సాయంత్రం స్టీల్ సిజిఎం హెచ్‌ఆర్ మధుసూదన్ ఉక్కు కార్మిక సంఘాల నేతలతో మాట్లాడారు. హెచ్‌ఆర్‌ఎ, విద్యుత్ ఛార్జీలు వంటి అంశాలు స్టీల్ ప్లాంట్ ఉన్నత యాజమాన్యం నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయని, సిఎమ్‌డితో మాట్లాడుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. దీంతో కార్మికులు రాత్రి వరకూ ఆందోళనను కొనసాగించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ.. స్టీల్ టౌన్‌షిప్ చుట్టు పక్కల ప్రాంతాల వారికి యూనిట్‌కు రూ.నాలుగు నుంచి ఐదు రూపాయలు మాత్రమే వసూలు చేసి స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో మాత్రం యూనిట్‌కు ఎనిమిది రూపాయలు వసూలు చేస్తామనడం సమంజసం కాదన్నారు. ఈ నెల 22న ఇదే అంశంపై కోర్టు వాయిదా ఉందని తెలిపారు. ఆ వాయిదా పూర్తయ్యేంత వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా ఉండాలని కోరినప్పటికీ యాజమాన్యం మాట వినిపించుకోవడం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రివైజ్డ్ బేసిక్‌పై 20 శాతం హెచ్‌ఆర్‌ఎను సాధించుకున్న ఘనత విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు మాత్రమే దక్కుతుందని, దానిని కూడా తొలగించాలని యాజమాన్యం చూస్తోందని తెలిపారు. ఆ నిర్ణయాన్ని పోరాటాలతో తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ఎఐటియుసి నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, డివిఆర్ ఎస్ఇయు యూనియన్ నాయకులు డివి.రమణారెడ్డి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



స్టీల్ ఇడి వర్క్స్ బిల్డింగ్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పోర్టులు, హార్బర్ల అభివృద్ధికి కృషి

మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోర్టులు, హార్బర్ల అభివృద్ధికి కృషి చేస్తానని మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. మంగళగిరి పట్టణం ఐహెచ్‌సి కార్పొరేట్ భవనం రెండో అంతస్తులోని ఎపి మారిటైమ్ బోర్డులో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆ స్థాయికి ఎదగడానికి కొండపి నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపిలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మాజీ శాసనసభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణికులపై ఛార్జీల భారం ఉండదు

- ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రయాణికులపై ఛార్జీల భారం పడకుండా చర్యలు తీసుకుంటామని సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ తెలిపారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలోని ఆర్‌టిసి హౌస్‌లో ఆయన ఛైర్మన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్తగా బస్సులు కొనుగోలు చేసి, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని సంస్థను లాభాల బాటలో నడిపిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామన్నారు. ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి సంస్థకు ఖర్చు తగ్గించనున్నట్లు తెలిపారు. కార్గో సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ప్రమాదాలు లేకుండా 99 శాతం బస్సులను ప్రజలకు సౌకర్యవంతంగా ఆర్‌టిసి నడుపుతోందని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెండు ఇంద్ర సర్వీసులను ప్రారంభించారు. అంతకుముందు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు మడింపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, పలువురు శాసన సభ్యులు, ఆర్‌టిసి అధికారులు బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, ఎంవై దానం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభం కాని పత్తి కొనుగోలు

- విస్తీర్ణం తగ్గినా పెరగని ధర
- పెరిగిన పెట్టుబడులతో అల్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మార్కెట్‌లోకి పత్తి దిగుబడులు వస్తున్నా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సిసిఐ తీవ్ర జాప్యం చేస్తోంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల ఒకటో తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఈ నెల మూడో వారం తరువాత ప్రారంభించాలని సిసిఐ అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయం రైతులకు శరాఘాతంగా మారింది. ఈ ఏడాది పత్తి పైరుకు అధిక వర్షాలు, వరదలతో పాటు చీడపీడల బారిన పడి రైతులు తీవ్ర నష్టపోయారు. పంట నిలదొక్కుకొని చేతికి వచ్చిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణం 14.68 లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది కేవలం 10 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. అధిక వర్షాలు, వరదలతో గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి కృష్ణా, బాపట్ల, పల్నాడు, ఏలూరు జిల్లాల్లో దాదాపు లక్ష ఎకరాల్లో పత్తి పైరు దెబ్బతింది. బాగున్న ప్రాంతాల్లో పంట చేతికి వచ్చినా ధర లేకపోవడం వల్ల రైతులు నిరాశకు గురవుతున్నారు. గతేడాది క్వింటాలు ధర రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ.12 వేల వరకు పలికింది. పొడవు రకం పత్తి కనీస మద్దతు ధర రూ.7521గా నిర్ణయించారు. పక్షం రోజుల క్రితం మార్కెట్‌లో పత్తి ధర రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.6500 నుంచి రూ.7 వేల వరకు మాత్రమే ధర లభిస్తోంది. సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఉంటే ధరలు కొంత మేరకు స్థిరంగా ఉండేందుకు అవకాశం ఉండేది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని మండలాల్లో గులాబి పురుగు ప్రభావంతో దిగుబడి తగ్గుతోందని రైతులు తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాభావం వల్ల పైరు ఎదుగుదల లోపించింది. పలు జిల్లాల్లో సగటున ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. అధిక వర్షాలతో దిగుబడి భారీగా తగ్గుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. నీటిలో నానిన పైరు ఉరకెత్తి కుళ్లి పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులకు ఎకరాకు రూ.20 వేల అదనపు ఖర్చు అవుతోంది. ఈ నేపథ్యంలో సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు ప్రారంభిస్తే మార్కెట్‌లో కనీసం క్వింటాలు రూ.8 వేల దాటే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. తాజాగా సిసిఐ కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. తేమ శాతం 8 నుంచి 12 శాతం దాటితే పత్తి కొనుగోలు చేయబోమని సిసిఐ జనరల్ మేనేజర్ అమర్నాథరెడ్డి తెలిపారు.

రైతులకు అపార నష్టం

కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి. రైతులకు క్వింటాలుకు రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలి. ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి. 1990లో నాన్ బీటి రకాలకు పెట్టిన నిబంధనలు ఇప్పుడు పెట్టడం సరికాదు. అప్పటి నిబంధనలను కేంద్రం సడలించాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పత్తిపైరు బాగా దెబ్బతిన్నా పైన పచ్చగా ఉందని అధికారులు చూసి వెళ్లిపోయారు. ఎక్కువ రోజులు నీటిలో నానడం వల్ల ఉరకెత్తి మొక్కలు కుళ్లిపోతున్నాయి.

- కంచుమాటి అజయ్‌కుమార్, ఎపి రైతు సంఘం నాయకులు

'కూటమి' నూతన మద్యం పాలసీలో...

'గోవిందుని' చెంత గ'మ్మత్తు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి. దీని పవిత్రతను కాపాడుతా' అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖజానా నింపుకునేందుకు ఇప్పుడు నూతన మద్యం పాలసీ పేరుతో మద్యాన్ని ఏరులై పారించేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. తిరుపతిలో మద్యం, మాంసం విక్రయాలు చేయరాదని వైసిపి హయాంలో టిడిపి డిమాండ్ చేసింది. దీనికి భిన్నంగా టిడిపి కూటమి సర్కార్ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతిలో 34 బ్రాందీ షాపుల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించింది. గత ప్రభుత్వం 22 షాపుల్లో మాత్రమే అమ్మకాలు చేపట్టింది. కొత్త ప్రభుత్వంలో మద్యం షాపులు అదనంగా 12 ఏర్పాటు కానున్నాయి. రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి వరకూ తిరుమలకుపోయే దారిలో ఎక్కడా బ్రాందీషాపులు ఉండరాదని ఆదేశించినా, అదే దారిలో 300 మీటర్ల దూరంలో బ్రాందీ షాపు పెట్టుకోవడానికి అనుమతి ఇచ్చింది. దేవుళ్ల పేర్లు కాకుండా వ్యక్తిగత పేర్లు పెట్టుకోవాలని సూచించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సిండికేట్ అయ్యి బ్రాందీషాపులు దక్కించుకునేందుకు ప్రయత్ని స్తున్నాయి. మద్యరహిత తిరుపతిగా ప్రకటించాలని ఓ పక్క మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. షాపుల సంఖ్య పెంచింది. తిరుపతిలో గోవిందుని పాదాల చెంత సందుకొక బ్రాందీ షాపు, గొందికొక బారు తెరుచుకో నున్నాయి. తిరుపతి జిల్లాలో 227 షాపులు ఏర్పాటు కానున్నాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 34 షాపులు, తిరుపతి రూరల్‌లో మరో 12 షాపులకు టెండర్లు ఆహ్వానించారు. గతంలో తిరుపతి జిల్లాలో 184 బ్రాందీ షాపులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, చంద్రగిరి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో 27 'బార్ అండ్ రెస్టారెంట్లు' ఉండేవి. గత ప్రభుత్వం 'బార్ అండ్ రెస్టారెంట్లు'కు ఇచ్చిన అనుమతి గడువు 2025 డిసెంబర్ 31 వరకు ఉంది. తిరుపతిలో స్టార్ హోటళ్లతో పేరుతో ప్రభుత్వ వ్యక్తుల ఆధ్వర్యాన 16 బార్లు ఉన్నాయి. అమెరికన్, కోణార్క్, పిసిఆర్, గణేష్ తదితర ప్రయివేట్ బార్లు నడుస్తున్నాయి. రాత్రి 11 గంటల వరకూ నిబంధన ఉన్నా తెల్లవారి మూడు గంటల వరకూ 'బార్లు' బోర్లా తెరిచే ఉంటున్నాయి.

తిరుపతిని మద్యరహితంగా ప్రకటించాలి

తిరుపతిని మద్యరహితంగా ప్రకటించాలి. ఇప్పుడున్న షాపుల కంటే తిరుపతిలో 12 అదనంగా తీసుకురావడం శోచనీయం. పవిత్రతను కాపాడతానని చెప్పి మద్యాన్ని ఏరులై పారించాలని చూస్తున్నారు. తిరుమల, తిరుపతి పవిత్రతను కాపాడాలి.

-పి.సాయిలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి

నలుగురు చిన్నారులు మృతి

- నీటి గుంతలో పడి ముగ్గురు, పురుగు మందు తాగి ఒకరు

ప్రజాశక్తి-నందవరం/ఎమ్మిగనూరు రూరల్

కర్నూలు జిల్లాలో చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు చిన్నారులు మరణించారు. నీటి గుంతలో పడి ముగ్గురు...పురుగు మందు తాగి మరొకరు మృతి చెందారు. కర్నూలు జిల్లా నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన బోయ జుట్ల భీమశేఖర్, రామలక్ష్మి దంపతుల కుమారుడు బోయ జుట్ల హనుమేష్ (6), బోయబైరి నడిపి రంగస్వామి, ఉరుకుందమ్మ దంపతుల కుమారుడు ఉదయ్ కిరణ్ (11), బోయ శ్రీనివాసులు కుమారుడు వంశీ, బోయ పాండు కుమారుడు బోయ చరణ్ కలిసి శనివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లారు. నీటి కోసమని పొలంలో ఉన్న గుంతలోకి దిగారు. ప్రమాదవశాత్తు హనుమేష్ గుంతలో పడిపోయాడు. అతన్ని రక్షించడానికి వెళ్లిన ఉదయ్ కిరణ్ కూడా గుంతలో పడిపోయాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు వంశీ, చరణ్ తెలియజేశారు. హనుమేష్, ఉదయ్ కిరణ్‌ను గ్రామస్తులు బయటకు తీశారు. అప్పటికే వారిద్దరూ మరణించారు. ఎమ్మిగనూరు మండలం ఎస్.నాగలాపురం గ్రామానికి మాణిక్యరావు, శాంతకుమారి దంపతుల మూడవ కుమారుడు సంపత్‌కుమార్..దసరా సెలవుల నిమిత్తం తన అమ్మమ్మగారి ఊరు పార్లపల్లి గ్రామానికి వెళ్లాడు. బహిర్భూమి కోసం వంకగట్టుకు వెళ్లి ప్రమాదవశాత్తు వంకలో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో బయటకు రాలేక ఊపిరాడక మరణించారు.


పురుగు మందు తాగి...

ఎమ్మిగనూరు మండలం కె.నాగలాపురం గ్రామానికి చెందిన బి.ఖాసీం, జయలక్ష్మి దంపతుల ఇద్దరు కుమారులు బి.మహేంద్ర (5), హరికృష్ణ ఇద్దరూ ఆడుకుంటూ క్రిమిసంహారక రసాయనాన్ని తాగారు. కొద్దిసేపటికి కడుపునొప్పి తాళలేక మహేంద్ర తన తల్లికి చెప్పాడు. ఇద్దరినీ ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మహేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హరికృష్ణను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

ప్రజాశక్తి-వెలుగోడు (నంద్యాల): పిడుగుపాటుకు యువకుడి మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేగడ గూడూరు గ్రామానికి చెందిన శివగంగాధర్ (24) తన మొక్కజొన్న పంటను రేగడ గూడూరు-అలగనూరు గ్రామాల మధ్య ఉన్న తెలుగు గంగ వంతెనపైనే ఆరబెట్టారు. రాత్రి కాపలాకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అతనికి సమీపంలో పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

శ్రీ అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం శ్రీ అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ కొలువుతీరారు. అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన క్యూలైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యూలైన్ల ద్వారా సామాన్య యాత్రికులు అమ్మవారిని ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శించుకుంటున్నారని తెలిపారు. దర్శనానికి వచ్చే విఐపిలు తమకు నిర్దేశించిన సమయాల్లోనే రావాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విఐపిల దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు. నిర్దేశించిన సమయాల్లో కాకుండా ముందుగా గానీ, తర్వాత గానీ వస్తే రూ.500ల క్యూ లైన్లలో పంపుతామని తెలిపారు. విఐపి పాస్‌లు ఉన్నవారు ఈ సూచన గమనించి అమ్మవారి దర్శనానికి నిర్దేశ సమయా ల్లోనే రావాలని కోరారు. శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, వైసిపి నాయకులు పోతిన వెంకట మహేష్ దర్శించుకున్నారు.

దుర్గమ్మకు వెండి నెమలి బహూకరణ

గుంటూరుకు చెందిన చేబ్రోలు పుల్లయ్య, రాజకుమారి అనే యాత్రికులు 5.700 కిలోల వెండితో తయారు చేయబడిన నెమలిని దుర్గమ్మకు సమర్పించారు. ఈ కానుకను అందజేసిన దాతలకు ఆలయ కార్యనిర్వహణ అధికారి కెఎస్ రామారావు స్వాగతం పలికి, శేష వస్త్రంతో పాటు, తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఎపిటిడిసి ఛైర్మన్‌గా బాలాజీ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ఛైర్మన్‌గా నూకసాని బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఎపిటిడిసి కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌ను ప్రగతిపథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీలు పి అశోక్ బాబు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, దువ్వాడ రామారావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, కూన రవికుమార్, యార్లగడ్డ వెంకట్రావు, బి ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, వేగ్నేశ నరేంద్రవర్మ, దామచర్ల జనార్ధన్, ఎం అశోక్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, ఏలూరు సాంబశివరావు, ఇంటూరి నాగేశ్వరరావు, మాలకొండయ్య, పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొని, బాలాజీకి అభినందనలు తెలిపారు.

బకాయి వేతనాల కోసం విఒఎల ఆందోళనలు

- కలెక్టర్, డిఆర్‌డిఎ కార్యాలయాల ఎదుట ధర్నా



శ్రీకాకుళం డిఆర్‌డిఎ పిడికి వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరు నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ వెలుగు విఒఎలు శనివారం ఆందోళనకు దిగారు. ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియ) ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో కలెక్టర్, డిఆర్‌డిఎ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అనంతరం పిడిలకు వినతిపత్రాలు అందజేశారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఆ సంఘం జిల్లా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ..నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమ తొలగింపులు అధికమయ్యాయన్నారు. మహిళా మార్ట్‌లో సరుకుల కొనుగోలుకు బలవంతపు టార్గెట్లు విధించే పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. సత్యసాయి జిల్లా డిఆర్‌డిఎ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌డిఎ పిడి నరసయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నా శిబిరం వద్దకు వచ్చిన డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళంలో ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు.

తప్పించుకున్న నంబాళ్ల కేశవరావు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

చత్తీస్‌గఢ్ భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజ్ తప్పించుకున్నట్లు సమాచారం. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మందికిపైగా మృత్యువాతపడగా, అందులో మావోయిస్టు పార్టీలో నంబర్-1గా ఉన్న బసవరాజు కూడా ఉన్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. అతనితోపాటు పార్టీ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జ్ ఆశన్న కూడా మరణించినట్లు భావించారు. అయితే ఇందులో నిజం లేదని, ఈ ఎన్‌కౌంటర్ నుంచి బసవరాజు, ఆశన్న తప్పించుకున్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వీరి జాడ తెలియక పౌర హక్కుల సంఘాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ మృతుల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

ఎన్నికల బాండ్లపై తీర్పు తిరగదోడే ప్రసక్తే లేదు

(మొదటిపేజీ తరువాయి)

అవినీతి పథకంగా మారింది. దాతలు అజ్ఞాతంగా రాజకీయ పార్టీకి నిధులు పంపడానికి ఈ పథకం అనుమతిస్తున్నది. దీంతో ఇడి, సిబిఐ, ఐటిలను పావులుగా వాడుకుని కంపెనీలను బెదిరించి ఎన్నికల బాండ్ల రూపంలో ముడుపులు పెద్దయెత్తున బిజెపి ఖాతాలో జమ కావడానికి ఇది లాకులెత్తింది. అదే సమయంలో ప్రతిపో రాజకీయ పార్టీలకు నిధులు అందకుండా చేసేందుకు దీనిని ఒక సాధనంగా చేసుకుంది. అయితే దీన్ని సవాల్ చేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు పలువురు సుప్రీం కోర్టును ఆనాడు ఆశ్రయించారు. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు, రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేసింది. రాజ్యాంగ ధర్మాసనం సుదీర్ఘంగా విచారించిన తరువాత 2024 ఫిబ్రవరి 15న తీర్పు ఇచ్చింది. ఎలక్టోరల్ బాండ్ల పథకం సమాచార హక్కును ఉల్లంఘించిందని, తద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం స్వేచ్ఛగా మాట్లాడే, భావవ్యక్తీకరణ హక్కును దెబ్బతీస్తుందని కోర్టు పేర్కొంది. రాజకీయ పార్టీలకు విరాళాలు గోప్యంగా ఇవ్వడానికి అనుమతించడంతో పారదర్శకత లోపిస్తుందని స్పష్టం చేసింది. ఈ పథకాన్ని రద్దు చేస్తున్నట్లు తీర్పులో పేర్కొంది. అనంతరం తీర్పుపై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలైంది. ఈ రివ్యూ పిటిషన్‌ను రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది.

తిరుపతి నుంచి ఢిల్లీకి విమాన సర్వీస్

- ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నుంచి ఢిల్లీకి విమాన సేవలు ప్రారంభమయ్యాయి. తొలి ఇండిగో విమానాన్ని తిరుపతి విమానాశ్రయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి నుంచి ఢిల్లీకి వెళ్లడానికి పడుతున్న ఇబ్బందులను గ్రహించి ఇండిగో విమానాన్ని ప్రారంభించామని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఉన్నారు. అంతకుముందు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి దర్శించుకున్నారు.

ఎంజిఆర్ ఫ్యాన్స్‌కు పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎఐడిఎంకె ఏర్పాటై ఈనెల 17కు 53 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకులు ఎంజిఆర్ ఫ్యాన్స్‌కు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు. 'పురచ్చితలైవర్' ఎంజిఆర్‌పై అభిమానం తాను చెన్నైలో ఉన్నప్పుడు మొదలైందని పేర్కొన్నారు. ఇటీవల తిరుపతి సభలో సనాతన ధర్మం గురించి మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన ఓ యువనేత చేసిన వ్యాఖ్యలంటూ చేసిన విమర్శల నేపథ్యంలో డిఎంకె పార్టీ నుంచి విమర్శలు వెళ వెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎఐడిఎంకెకు దగ్గరయ్యేలా పవన్‌కల్యాణ్ ట్వీట్ చేసి ఉంటారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ప్రజల్లోకి శాప్ కార్యకలాపాలు

- ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నిర్వహించే పనులన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ సంస్థ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి ఎమ్‌డి పిఎస్ గిరీషా శనివారం కలిశారు. శాప్ నిర్వహిస్తున్న పనులను ఎమ్‌డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో ఛైర్మన్‌కు వివరించారు. అనంతరం శాప్ విధుల నిర్వహణ, క్రీడా స్థలాలు, పాలసీలు, జివోలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.గతంలోలా కాకుండా జవాబుదారీతనంతో శాప్ పనిచేస్తుందని క్రీడాకారులు, ప్రజలకు తెలియాలని అన్నారు. క్రీడారంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, గత ప్రభుత్వ పొరపాట్లను సరిదిద్దుతూ సంస్థను ముందుకు తీసుకెళ్తానని చెప్పారు. సంస్థ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసి క్రీడాకారులకు నిరంతరం సమాచారం అందించాలన్నారు. సాంకేతికతను ఉపయోగించి పనిచేస్తే మరింత పారదర్శకంగా ఉంటుందని చెప్పారు. ఛైర్మన్ సూచనలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్‌డి గిరీషా తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌ఓ రమణమ్మ, ఇఇ సిద్ధయ్య, ఎస్‌వోలు మహేష్, కోటేశ్వరరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి, పల్లా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి టిడిపి కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. యోగివేమన విశ్వవిద్యాలయాన్ని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బావమరిది సురేంద్రనాథ్‌రెడ్డి తన చెప్పుచేతల్లో పెట్టుకొని అవినీతికి, అనైతిక కార్యక్రమాలకు పాల్పడ్డారని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి గంగా సురేష్ ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పల్లా శ్రీనివాస్, మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

వర్లను కలిసిన వెయిట్ లిఫ్టర్ శ్రీనివాసరావు

కామెన్‌వెల్త్-2026 పోటీల్లో పాల్గొనేందుకు సహాయ సహకారాలు అందించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను వెయిట్ లిఫ్టర్ మందంపల్లి శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో కలిశారు. రాష్ట్రం తరపున పాల్గొనేలా అవకాశం కల్పించాలని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని రామయ్య శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు.

అస్పియా మృతి పట్ల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విచారం

- నేడు మంత్రుల పరామర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పుంగనూరుకు చెందిన ఫైనాన్స్ వ్యాపారి అజమతుల్లా కుమార్తె చిన్నారి అస్పియా మృతి పట్ల రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. అస్పియా కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఈనెల 6న పుంగనూరుకు మైనార్టీ మంత్రి ఫరూఖ్, హోమ్ మంత్రి అనితతో కలిసి తాను వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం విజయవాడలో మాట్లాడుతూ చిన్నారి మృతిపైన వైసిపి శవరాజకీయాలు మొదలు పెట్టడం వైసిపి నీచ నైజానికి నిదర్శనమన్నారు. డిఐజి స్థాయి నుంచి ఎస్‌పి, డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐల వరకు చిన్నారి కోసం ఎంతో ప్రయత్నించినా కనపించకుండా పోయిన చిన్నారి మరణం కాదనలేని విషాదమన్నారు. అస్పియా మరణాన్ని అడ్డు పెట్టుకుని పెద్దిరెడ్డి లాంటి డాన్‌లు డ్రామాలు మొదలు పెట్టడమే దారుణమన్నారు. అస్పియా ఆచూకి కోసం 11 పోలీస్ బృందాలు మూడు రోజులు నిరంతరాయంగా గాలింపు చర్యలు జరిపాయని తెలిపారు.

సరైన కూలి లేదు... వసతీ లేదు

- శ్రమ దోపిడీకి పాల్పడుతున్న కాంట్రాక్టర్లు
- దసరా మహోత్సవాల్లో తాత్కాలిక పారిశుధ్య కార్మికుల ఇక్కట్లు



దసరా ఉత్సవాల్లో పారిశుధ్య పనికోసం విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్దకు వచ్చిన కార్మికులు

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడలో జరుగుతున్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో తాత్కాలిక పారిశుధ్య కార్మికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అదనంగా పనిచేయించుకుంటున్న కాంట్రాక్టర్లు వారికి కనీస వసతులు కూడా కల్పించడం లేదు. దసరా మహోత్సవాల్లో ఈ నెల 2 నుంచి 15వ తేదీ వరకు పారిశుధ్యం పని చేయడానికి 1400 మంది రోజు వారీ కార్మికులు అవసరం ఉంది. విజయవాడ నగర పాలక సంస్థ ఆహ్వానించిన టెండర్‌ను దక్కించుకున్న టిడిపికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు (నేతలు) పూర్తి స్థాయిలో కార్మికులను తీసుకురాకుండానే 900 నుండి 1000 మందిలోపు కార్మికులతోనే మూడు రకాల పనులు చేయిస్తున్నారు. ఉదయం పారిశుధ్య పని, సాయంత్రం భవానీ మాల దీక్ష విరమించిన వారు నదీతీరంలోని ఘాట్లపై వదిలేసిన బట్టలను తొలగించడం, రాత్రి మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేయడం వంటి పనులను చేయిస్తున్నారు. రోజుకు 16 గంటలపాటు (రెండు షిఫ్ట్‌లు) పని చేయించుకుంటూ ఒక షిఫ్ట్‌కు మాత్రమే కాంట్రాక్టర్లు కూలి ఇస్తున్నారు. విజయవాడ నగర పాలక సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి కార్మికుడికీ ఒక షిఫ్ట్ (ఎనిమిది గంటలు) పని చేస్తే తప్పనిసరిగా రూ.500 ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన రెండు షిఫ్ట్‌లు పని చేయిస్తే రూ.1000 ఇవ్వాలి. విఎంసి ఎఫ్ఆర్ఎస్ మస్టర్ విధానంలో ఒక్కో కార్మికుడు ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయడానికి అవకాశం ఉంటుంది. దీంతో, విజయవాడకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఈ ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేస్తే తమ కాంట్రాక్టర్లకు మిగిలేదేమీ ఉండదని, దానిని అమలు చేయొద్దని అధికారులపై ఒత్తిడి చేసే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. కానీ, ఆయన ప్రయత్నం ఫలించలేదని సమాచారం. అయినా, కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కి కార్మికులతో రెండు షిఫ్ట్‌ల్లో పనులు చేయిస్తూ కేవలం రూ.550 నుంచి రూ.600లోపు మాత్రమే ఇస్తామని సదరు మేస్త్రీలతో చెప్పిస్తున్నారు. ఈ కూలి డబ్బులు కూడా ఏ రోజుకారోజు ఇవ్వకుండా ఉత్సవాలు ముగిసిన తర్వాతే ఇస్తామని తెగేసి చెబుతున్నారు. గతంలో ఉత్సవాలు ముగిసిన తర్వాత కార్మికులకు కూలి డబ్బులు ఎగ్గొట్టిన సంఘటనలు ఉన్నాయి. మరోవైపు భోజనంతోపాటు అన్ని రకాల వసతి కల్పిస్తామని చెప్పి కార్మికులను తీసుకొచ్చిన కాంట్రాక్టర్లు... వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఈ నేపథ్యంలో కూలి డబ్బులు వస్తాయో రావోనన్న భయాందోళనతో కొంతమంది కార్మికులు పనిలో చేరిన ఒకటి రెండు రోజులకే తిరిగి వెళ్లిపోతున్నారు. ఈ నెల 2న పనిలోకి వచ్చిన నందిగామ ప్రాంతానికి చెందిన కొందరు కార్మికులు తిరిగి వెళ్లిపోయారు. కనీసం తాగడానికి మంచినీరు, తినడానికి భోజనం, నిద్రించడానికి వసతి లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్డి సదుపాయం కూడా కల్పించలేదు. దీంతో, కార్మికులు ముఖ్యంగా మహిళా కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వందలాది మంది కార్మికులను నిర్మాణంలో ఉన్న విఎంసి నూతన భవనంలో ఉంచారు. తమకు కూలి సరిగా ఇవ్వకపోవడంతోపాటు కనీస సదుపాయాలు కల్పించలేవని గుంటూరు జిల్లా తెనాలి పెదరావూరుకు చెందిన కార్మికుడు వెంకటేశ్వరరావు, పలువురు మహిళలు వాపోయారు. కనీసం ఉదయాన్నే టీ తాగడానికి కూడా చేతిలో డబ్బులు లేవని, టిఫిన్ కూడా తినకుండా ఎవరో ఒకరు భోజనాలు పెడుతుంటే వాటితోనే సరిపుచ్చుకుంటూ అర్ధాకలితో పనులు చేయాల్సి వస్తోందని కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించడంతోపాటు నిబంధనల ప్రకారం కూలి ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ నగర నాయకులు టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు.

విద్యారంగం సమస్యలపై పోరాటం

- ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు
- అనంతపురంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వై. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు సాగిస్తోందని ఆ పార్టీ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు అన్నారు. అనంతపురం అంబేద్కర్ భవనంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈనెల ఎనిమిదవ తేదీ వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో తొలిరోజు జరిగిన కార్యక్రమంలో వై. వెంకటేశ్వర్లతో పాటు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జెండాను ప్రసన్న ఆవిష్కరించారు. ప్రారంభ సభలో వెంకటేశ్వర్లు, గేయానంద్ మాట్లాడారు. విద్యా రంగాన్ని నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. దీని వల్ల దేశంలో ప్రాథమిక విద్య పూర్తి స్థాయిలో నాశనమైందని విమర్శించారు. పలు పాఠశాలలు మూతపడ్డాయని, చాలామంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేకపోవడంతో నిరుద్యోగ సమస్య అధికమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం దురదృష్టకరమన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కోరారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓతూరు పరమేష్, రామ్మోహన్, వినోద్ కుమార్, కిరణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య, అనంతపురం జిల్లా అధ్యక్షులు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

203 సంస్థలకు ఎపిఐఐసి భూములు

- 4,300మంది యువతకు ఉద్యోగావకాశాలు
- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో 203 సంస్థలకు ఎపిఐఐసి భూములు కేటాయించడం శుభపరిణామమని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. భూముల కేటాయింపులు జరిగిన పరిశ్రమల ద్వారా రూ.2,349.86 కోట్ల పెట్టుబడులు, 4,300మంది యువతకు ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజును అనిత అభినందించారు. మారిటైమ్ బోర్డు కార్యాలయ సమీపంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఎపిఎంబి ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా ఆమె హాజరయ్యారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎపిఐఐసి, మారిటైమ్ బోర్డు నూతన ఛైర్మన్లను ఆమె అభినందించారు. సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో పరిశ్రమల ఏర్పాటు, పోర్టుల అభివృద్ధితో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయని అనిత పేర్కొన్నారు.

ప్రజాచైతన్యానికి సాంస్కృతిక రంగం కీలకం

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాచైతన్యానికి సాంస్కృతిక రంగం కీలకమని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన పూలే అంబేద్కర్ భవనంలో 'సాంస్కృతిక రంగం - ప్రభుత్వ బాధ్యత' అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవీయ విలువలు పెంచే, సమాజాభివృద్ధిని కాంక్షించే ప్రజా సంస్కృతి పెంపుదలకు ప్రభుత్వం ఏ మాత్రమూ బాధ్యత వహించడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజానాట్యమండలి వంటి ప్రజా కళాసంస్థలు ఐక్యంగా ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమం నిర్వహించాలని అన్నారు. ప్రజలకు సంబంధం లేని అనేక విషయాలను ప్రభుత్వాలు బూతద్దంలో చూపుతూ ముఖ్య సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించే యత్నం చేస్తోందని తెలిపారు. పేదల సమస్యలు ప్రభుత్వానికి అప్రధాన అంశంగా మారాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రజానాట్యమండలి లాంటి సంస్థలు ప్రజలను మేల్కొలపాలని సూచించారు. ప్రజా సంస్కృతిని కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లో ముంచిన ప్రభుత్వ తీరును విమర్శించారు. ప్రభుత్వాలు వాటి ధర్మాన్ని నిర్వర్తించేలా పిఎన్ఎం లాంటి సంస్థలు పోరాడాలని కోరారు. లౌకిక ప్రజాస్వామ్య సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సినీనటులు, నాటక రంగ ప్రయోక్త కృష్ణేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల కళ్లకు కట్టినట్లు కళాకారులు చూపించే కార్యక్రమం ఎంతో ప్రభావాన్ని చూపిస్తుందని చెప్పారు. మానవత్వం, నైతిక విలువల పరిరక్షణలో నాటక ప్రక్రియది కీలక, ప్రత్యక్ష పాత్రని తెలిపారు. కన్యాశుల్కం నాటకం ఆనాటి సమాజ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం బిజెపి చెబుతున్న ఏక్తా భావం వెనుక ఉన్న కుట్రలను నాటకం ప్రజలకు చూపిస్తుందని తెలిపారు. లడ్డూ వివాదం అత్యంత పనికిమాలిన విషయమని పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నాటక రంగ విశ్లేషకులు మంతెన సీతారాం, పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు మంగరాజు, గాదె సుబ్బారెడ్డి, వివిధ కళా సంస్థల తరుపున వౌరప్రసాదు, హెచ్‌విఆర్ఎస్ ప్రసాదు, కొనాడ అశోక్, వడ్లమూడి పద్మ, మోతుకూరి అరుణ్‌కుమార్, ఎల్ఎస్ఆర్‌కె ప్రసాదు, నరేన్, యువి రత్నం, శివశంకర్ తదితరులు మాట్లాడారు. తొలుత ప్రజానాట్యమండలి పతాకాన్ని మంగరాజు ఆవిష్కరించారు.

గీత కార్మికులకు మొండిచేయి

- మద్యం నోటిఫికేషన్‌లో కనిపించని రిజర్వేషన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మద్యం నూతన పాలసీ గెజిట్‌లో గీత వృత్తిదారులకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. మొత్తం దుకాణాల్లో పది శాతం గీత వృత్తిదారులకు కేటాయిస్తామన్న ప్రభుత్వం...గెజిట్ నోటిఫికేషన్‌లో మాత్రం ఆ పదిశాతం ఎక్కడా నోటిఫై చేయలేదు. ఈనెల 1న జిల్లాల వారీగా ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం దుకాణాలను గుర్తిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 3396 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం గీత వృత్తిదారుల కుటుంబాలకు (పది శాతం) 340 దుకాణాలు రిజర్వు చేయాల్సివుంది. కానీ, గెజిట్‌లో అలాంటి గుర్తింపు ఏమీ లేకపోవడం గమనార్హం. విజయనగరం జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 149 దుకాణాలు ఉండేవి. ప్రస్తుత గెజిట్ ప్రకారం నాలుగు దుకాణాలు పెరిగాయి. దీంతో, దుకాణాల సంఖ్య 153కు చేరింది. ఈ లెక్కన కనీసం 15 దుకాణాలు గీత వృత్తిదారుల కుటుంబాలవారికి రిజర్వు చేయాల్సి వుంది. కానీ, గెజిట్‌లో ఒక్క దుకాణాన్ని కూడా నోటిఫై చేయలేదు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా ఆయా గెజిట్ నోటిఫికేషన్లలో గీత వృత్తిదారుల గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్టు సమాచారం. ఇదే విషయమై విజయనగరం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావును ప్రశ్నించగా 'ప్రస్తుత గెజిట్‌లో రిజర్వేషన్లు ఏమీ లేవు. గీత వృత్తిదారులకు సంబంధించి ప్రభుత్వం విడిగా జిఒ ఇస్తుందేమో' అంటూ ప్రజాశక్తికి వివరించారు. కానీ, ప్రభుత్వం ఎక్కడా ఇలాంటి ప్రకటన చేయలేదు. ఒకవేళ అధికారులు చెప్పినట్టు గీత వృత్తిదారులకు ప్రత్యేకంగా కేటాయిస్తే ఆ దుకాణాలను ఎక్కడ పెడతారు? అనేది పెద్ద ప్రశ్న. అప్పటికే దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఇందుకు అంగీకరిస్తారా? ఒకవేళ అంగీకరించినా నిర్దిష్టమైన ప్రాంతంలో రిజర్వుడ్, నాన్ రిజర్వుడ్ దుకాణాలు ఉంటే ఇద్దరికీ వ్యాపారం తగ్గే అవకాశం ఉంటుంది. వ్యాపారుల సంగతి అటుంచితే.... వృత్తిదారులకు ఒరిగేదేమీ ఉండబోదని ప్రజల నానుడి.

'ఇసుక' అసత్య ప్రచారంపై కఠిన చర్యలు

- మీనాకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉచిత ఇసుక విధానంపై సామాజిక మాధ్యమం వేదికగా అసత్య ప్రచారం జరుగుతోందని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాను ఆదేశించారు. ఈ మేరకు గనులశాఖ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. ఇసుకను పూర్తి పారదర్శకంగా సరఫరా చేస్తున్నా తప్పుడు ప్రచారం చేస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా అబద్ధాలతో ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తేలా జరుగుతున్న ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. ఈ తరహాలో వ్యవహారాలపట్ల కఠినంగా వ్యవహరించాలని మీనాను ఆదేశించారు. ప్రభుత్వం నిజాయితీగా అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానంపై జిల్లాస్థాయిలో నిజానిజాలను వెలికితీయాలని, బాధ్యులు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని సిఎం పేర్కొన్నారు.



చెన్నయ్‌లో నిర్వహించిన ర్యాలీలో కె బాలకృష్ణన్, కనకరాజన్, ముదురాసన్ తదితరులు

సామ్‌సంగ్ కార్మికులకు మద్దతుగా వామపక్షాల ర్యాలీ

చెన్నయ్ : తమిళనాడులోని సామ్‌సంగ్ తయారీ యూనిట్‌లో వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న కార్మికులకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. వీరి ఉద్యమానికి సంఘీభావంగా సామ్‌సంగ్ యాజమాన్యం తీరును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ చెన్నయ్‌లో శనివారం భారీ ర్యాలీ చేపట్టాయి. యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని, వేతనాలను పెంచాలని, పని వేళలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గత కొన్ని నెలలుగా సామ్‌సంగ్ కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి విదితమే. వీరికి మద్దతుగా చేపట్టిన ర్యాలీలో సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కె బాలకృష్ణన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె కనగరాజన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్ ముదరాసన్, సిపిఎం (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి అసైతంబి, సిఐటియు ప్రధానకార్యదర్శి జి సుకుమారన్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా సంఘీభావం

సామ్‌సంగ్ కార్మికులకు ఐద్వా తమిళనాడు రాష్ట్ర కమిటీ కూడా సంఘీభావం ప్రకటించింది. ఐద్వా జాతీయ నాయకులు పి సుగంతి, యు వాసుకి తదితరులు సామ్‌సంగ్ కార్మికుల ఆందోళన శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలియజేశారు. న్యాయసమ్మతమైన పోటానికి రాష్ట్ర మహిళలంతా అండగా నిలుస్తారని తెలిపారు.



వకుళమాత వంటశాలను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

తిరుమల పవిత్రతను కాపాడాలి

- విఐపి సంస్కృతి తగ్గాలి
- టిటిడి అధికారుల సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, కొండపై గోవింద నామస్మరణ తప్ప, మరోమాట వినిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. పద్మావతి అతిథి గృహంలో టిటిడి అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. తిరుమలలో ప్రశాంతతకు ఎక్కడా భంగం కలగకూడదని, ఏ విషయంలోనూ రాజీపడొద్దన్నారు. తిరుమలలో విఐపి సంస్కృతి తగ్గాలని, ప్రముఖులు వచ్చినప్పుడు హడావిడి కనిపించకూడదని, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అలంకరణ ఉండాలని సూచించారు. టిటిడి సేవలపై యాత్రికులు తమ అభిప్రాయాలను చెప్పే అవకాశాన్ని కల్పించాలని, అన్ని దేవాలయాల్లోనూ యాత్రికుల అభిప్రాయాలను తీసుకోవాలని నిర్దేశించారు. తిరుమల కొండపై భవిష్యత్ నీటి అవసరాలకు తగినట్లు ముందస్తు ప్రణాళిక అవసరం అన్నారు. అటవీ ప్రాంతాన్ని 72 శాతం నుంచి 80కి పెంచాలని సూచించారు. స్విమ్స్ సేవలు మెరుగుపడాలన్నారు. అంతకు ముందు తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన అధునాతనంగా రూ.13.45 కోట్ల వ్యయంతో నిర్మించిన కేంద్రీకృత వకుళమాత వంటశాలను చంద్రబాబు ప్రారంభించారు. దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో జెర్రి

టిటిడి మాధవ నిలయం అన్నదాన కేంద్రంలో భోజనం చేస్తున్న ఓ యాత్రికుడి ఆకులో జెర్రి కనిపించింది. దీంతో టిటిడి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అయితే సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం ఇస్తూ, తమను వెళ్లిపొమ్మన్నారని యాత్రికులు మీడియాకు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల నూతన భవనాల ప్రారంభోత్సవ సభలో విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న కేరళ సిఎం పినరయి విజయన్

కేరళ ప్రభుత్వ విద్య దేశానికే ఆదర్శం

- ముఖ్యమంత్రి విజయన్

తిరువనంతపురం : కేరళ ప్రభుత్వ విద్యా రంగం మిగిలిన దేశానికి ఒక ప్రామాణికంగా నిలిచిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. జనరల్ ఎడ్యుకేషన్ ప్రొటెక్షన్ మిషన్, విద్యాకిరణం మిషన్ వంటి వాటితో సహా వివిధ చొరవల ద్వారా ఉన్నత ప్రమాణాలు నిర్దేశించడంలో రాష్ట్రం విజయం సాధించిందన్నారు.

శ్రీకార్యం ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పలు స్కూళ్ళలో అత్యంత అధునాతనమైన స్కూలు భవనాలు నిర్మించడం, స్మార్ట్ తరగతులను లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. 30 స్కూలు భవనాలను విజయన్ ప్రారంభించారు. మరో 12 భవనాలకు శంకుస్థాపన చేశారు. కేరళ మౌలిక సదుపాయాల పెట్టుబడుల నిధి సహాయంతో రూ.5వేల కోట్ల ఖర్చుతో 973 స్కూలు భవనాల నిర్మాణం చేపట్టారు. వీటిలో ఇప్పటివరకు 508 పూర్తయ్యాయి. ఈ చర్యన్నింటితో రాష్ట్ర విద్యా రంగంలో పిల్లలకు మెరుగైన భవితవ్యానికి హామీ కల్పించబడిందన్నారు.



పర్స సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సింగరావు, సిఐటియు నాయకులు

'పర్స' ఆశయాలకు పునరంకితమవుదాం

- స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఉద్యమిద్దాం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశకి-విజయనగరం టౌన్

కార్మిక హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన పర్స సత్యనారాయణ స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు పునరంకితం అవుదామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. పర్స సత్యనారాయణ శత జయంతి సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా నర్సింగరావు హాజరై మాట్లాడారు. ముందుగా పర్స సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలను తెలియచేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ అధ్యక్షతన జరిగిన సదస్సులో నర్సింగరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఆనాడు రాజీనామా చేసిన 52 మంది ఎమ్మెల్యేల్లో పర్స సత్యనారాయణ ఒకరని తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే సింగరేణి కంపెనీలో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. తెలుగు రాష్ట్రంలో సిఐటియును ఏర్పాటు చేసిన తర్వాత మొదటి రాష్ట్ర అధ్యక్షులు ఆయనేనని తెలిపారు. 32 ఏళ్ల పాటు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులుగా ఉండి కార్మిక హక్కుల కోసం, కార్మిక వర్గ రాజ్యం కోసం, సోషలిస్టు వ్యవస్థ కోసం పని చేశారని వివరించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తుంటే దాని గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. మోడీకి తొత్తులుగా రాష్ట్ర పాలకులు మారారని విమర్శించారు. ఇటువంటి పరిస్థితిలో పర్స సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక వర్గ హక్కుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ఐక్యంగా కదలాలని కోరారు. సిఐటియు పూర్వ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని కార్మికుల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి పర్సా సత్యన్నారాయణ అని కొనియాడారు. సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సూర్యనారాయణ, యుఎస్ రవికుమార్, వి.రాములు, ఎం.రమణ, ఎ.గౌరినాయుడు, బి.సుధారాణి కార్మికులు పాల్గొన్నారు.

మనిషి తీసుకెళ్ళగల వైమానిక రక్షణ వ్యవస్థ ట్రయల్స్ పూర్తి : డిఆర్‌డిఓ

న్యూఢిల్లీ : మనిషి తీసుకెళ్ళగల పోర్టబుల్ వైమానిక రక్షణ వ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన ట్రయల్స్ పూర్తయ్యాయని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) శనివారం ప్రకటించింది. దేశీయంగా అభివృద్ధిపరిచిన, నాల్గవ తరానికి చెందిన సూక్ష్మీకరించబడిన వెరీ షార్ట్ రేంజ్‌ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (విఎస్‌హెచ్‌ఒఆర్‌ఎడి)కి ఇప్పటికి మూడుసార్లు వరుసగా పరీక్షలు నిర్వహించారు. అభివృద్ధి ట్రయల్స్‌లో కూడా పాల్గొన్నాయని డిఆర్‌డిఓ ఒక ప్రకటనలో తెలిపింది.

సంపాదకీయం


...జస్ట్ ఆస్కింగ్!

'సమాజంలో కులం- సమాజాంతరాల్లో కులం/ కులంలో కులం- మతంలో కులం/ గుడిలో కులం- బడిలో కులం/ పెళ్లిలో కులం- ప్రేమలో కులం' అంటారు కవి శంబూక. 'జైళ్లలోనూ కులం - ఖైదీలకు చెప్పే పనుల్లోనూ కులం' వుందన్న విషయాన్ని 'జై భీమ్' సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపిస్తే, నిజ జీవితంలో వేళ్లూనుకొని వున్న కుల వివక్ష జైళ్లలోనూ వుందని, ఆ వివక్షకు ముగింపు పలకాలని, కులం ఆధారంగా పనిని వేరు చేసి కేటాయించే పద్ధతులను విడనాడాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం...మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయమైంది. మనకున్న కులం భాష- సంస్కృతం. దానికి మరో పేరు దేవభాష. 19వ శతాబ్దం వరకూ శూద్ర, పంచములకి చెందిన ఎవ్వరూ ఈ దేవభాషను నేర్చుకోరాదనే పైశాచిక అంశాలుండేవి. మనకున్న కులం ఫిలాసఫీ- బ్రాహ్మణ మతం. దానికి మరో పేరు వేదాంతం. మనకున్న కులచట్టం- మనుధర్మ శాస్త్రం. ఇది వేల ఏళ్లుగా మన భౌతిక, మానసిక జీవితాన్ని నిర్దాక్షిణ్యంగా శాసిస్తూ వచ్చింది. భారతదేశం నా మాతృభూమి- భారతీయులంతా నా సహోదరులన్న సోదరభావాన్ని...ఈ కులమతాల సంస్కృతి విషపూరితం చేసింది. తరతరాల మానవ మేధస్సుకు మేకులు కొట్టిన ఈ సంస్కృతి, దేశ ప్రజల ప్రగతికి శిలువ వేసింది. 'నేను పుట్టక ముందే/ దేశద్రోహుల జాబితాలో/ నమోదైంది నా పేరు' అంటారు ఖాదర్ మొహియుద్దీన్. అలాగే..పుట్టుకతో పడిన కుల వివక్ష ముద్ర... పుట్టుమచ్చలా మరణం వరకూ వెంటాడుతోంది.

కుల వ్యవస్థను అసహ్యించుకుంటున్నట్లు నటిస్తూ, అభ్యుదయం గురించి కోతలు కోస్తూ, అంతర్నాటకమాడే ప్రబుద్ధులు నేడు అవతరించారు. జాతి నరనరాన్ని నమిలివేస్తున్న కులతత్వాన్ని తిరిగి పునరుద్ధరించాలనే మతోన్మాద భావజాలాన్ని సనాతన ధర్మం అంటూ భుజానికెత్తుకోవడం అంటే... ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను నిరంకుశంగా అణగదొక్కడం కాదా? సనాతన ధర్మం, హిందూ సంస్కృతి వంటి అర్థం తెలియని పదాలను వల్లెవేస్తారేగాని, ఆ ధర్మాల లోతుగాని, మతం ఎత్తిన అవతారాలుగాని తెలుసుకోరు. 'మానుతున్న గాయాన్ని మళ్లీ ఎవరో కెలికారు/ ఎవరో స్వేచ్ఛను యాభై ఏళ్లలోపే పరీక్షకు నిలబెట్టారు' అంటారు కవి యాకూబ్. 'భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, దేశ సమగ్రతను కాపాడుతానని, పక్షపాతం లేకుండా ప్రజలందరికీ న్యాయం చేస్తా'నని ప్రమాణం చేసిన వ్యక్తి, ఇప్పుడు తానొక మత ప్రతినిధిగా, సనాతన ధర్మ పరిరక్షకునిగా ప్రకటించుకోవడం చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించడం కాదా? రాజ్యాంగబద్ధంగా ప్రజలిచ్చిన పదవిని అవమానించడం కాదా? సనాతన ధర్మానికి ప్రాతిపదిక- కులం. సనాతన ధర్మాన్ని ప్రబోధించే ధర్మశాస్త్రాల్లో శూద్ర- పంచములపై అమలుజేయబడ్డ నిషేధాలు- సాంఘిక కిరాతకత్వానికి చిహ్నాలు కాదా? సనాతన ధర్మాన్ని ప్రబోధించడం అంటే కులవ్యవస్థను ప్రోత్సహించడం కాదా? సనాతన ధర్మం అంటే-దళితులు, గిరిజనులపై తరతరాలుగా పెరిగిపోతున్న అంటరానితనం, కుల వివక్ష, మహిళలపై సాగుతున్న అణచివేతకు దన్నుగా నిలవడం కాదా? 'జస్ట్ ఆస్కింగ్...' అంటున్నారు ప్రజలు.

గుర్రం జాషువా ఒకసభలో గొంతెత్తి పద్యం చదివితే, అదే సభలో వున్న 'కవి సామ్రాట్' బిరుదాంకితుడైన ఒకాయన 'జాషువా గారు పంచమ స్వరంలో చదివిన పద్యం ఆ పాత మధురంగా వుంది' అన్నాడట. జాషువా పంచముడనే విషయాన్ని సభలో కూడా ఎత్తిపొడవడమే ఆయన ఉద్దేశం.. అంటూ 'ఆధునిక యుగంలో కుల వ్యవస్థ' అనే పుస్తకంలో పేర్కొన్నాడు సీవీ. లౌకికతత్వాన్ని గౌరవించాల్సిన ఒక మంత్రి...'సూడో సెక్యులరిజం' అంటూ చులకనగా మాట్లాడటం, ఒక మతతత్వ ప్రతినిధిలా ఇతర మతాలను తూలనాడే విధంగా వ్యాఖ్యానించడం చూస్తే... కులాన్ని దూషించిన ఆ కవి సామ్రాట్‌కి, లౌకికతత్వ విలువలకు, నైతికతకు వలువలూడ్చిన ఈ నట సనాతన వాదికి తేడాలేదు. 'కులం పునాదుల మీద ఒక జాతిని నిర్మించలేదు. ఒక నీతిని నిర్మించలేదు' అంటారు అంబేద్కర్. ప్రతి భారతీయుడి నరనరాన జీర్ణించుకొని వున్న లౌకికతత్వాన్ని నిర్జించి, ఏ విలువల నిర్మాణం కోసం సనాతన ధర్మ రక్షణ చట్టం తేవాలని అంటున్నారో... సదరు మంత్రిగారు చెప్తారా?

మహనీయుల మాట




నేను, నా దేశం..
ఈ రెంటిలో
నా దేశమే ముఖ్యమైనది.

- డా॥ బి.ఆర్ అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

నిబద్ధ మీడియా నిర్బంధానికి లొంగేనా?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

గురువారం నాడు ఢిల్లీ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ మీడియా సంస్థల సీనియర్ ప్రతినిధులు అనేక మంది సమావేశమై దేశంలో మీడియా స్వేచ్ఛను కాపాడుకోవడం ఎలా? ముప్పు ఎటు వైపు నుంచి వస్తుంది? వంటి అంశాలు చర్చించారు. ప్రజాస్వామికంగా ఈ పోరాటం ఏయే రూపాలలో చేయొచ్చునో కూడా వారు ప్రస్తావించుకున్నారు. 'న్యూస్ క్లిక్' పై మోడీ సర్కారు దాడి మొదలై ఏడాది గడుస్తున్న సందర్భంలో వారు ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవడం కూడా ఆసక్తికరమైందే. ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియాతో సహా పలు పాత్రికేయ సంఘాలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి. ఈ సమావేశంలో వారు మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించడం విశేషం. జీవించే హక్కు పని హక్కు రెండూ విడదీయరానివే. అంతగా అవి ముడిపడి వుంటాయని పేర్కొన్నారు. 'దాడులు, గాలింపులు జరిపి లాప్‌ట్యాప్‌లు, ఫోన్లు, కంప్యూటర్ల వంటి వృత్తి పరికరాలు ఇష్టానుసారం స్వాధీనం చేసుకుని తీసుకు పోవడమే గాక మళ్లీ తిరిగి ఇవ్వకపోతే ఎలా? అది జీవనోపాధి హక్కుపై దాడి లాంటిదే అవుతుంది కదా?' అని ప్రశ్నించారు. 'న్యూస్ క్లిక్'పై దాడి భారతదేశ మీడియా స్వేచ్ఛా సమరంలో అతి దారుణమైన సందర్భం. 1975లో ఎమర్జన్సీ తర్వాత కాలంలో అదే చెప్పుకోవలసిన ఘటన అని 'హిందూ' మాజీ ప్రధాన సంపాదకుడు ఎన్.రామ్ ఈ సందర్భంలో పేర్కొన్నారు. అయితే దీన్ని కేవలం మీడియా వ్యవహారంగానే గాక పోలీసుల పెత్తనంతో సాగిన రాజకీయ కథగా చూడవలసి వుంటుందని ఆయన స్పష్టం చేశారు. వామపక్ష, ప్రజాస్వామిక భావ జాలంతో పని చేసే ఓ స్వతంత్ర మధ్యతరహా మీడియా సంస్థపై జరిగిన ఈ దాడి అలాంటి జర్నలిజానికి పొంచి వున్న సవాళ్లకు సంకేతమని రామ్ స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం స్పష్టమైన నిర్దేశిత లక్ష్యంతో భయోత్పాతం సృష్టిస్తూ, దేశ ద్రోహం వంటి కేసులు బనాయిస్తూ మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధులు, మానవ హక్కుల కార్యకర్తలు, పౌర సమాజ సంస్థల వంటి వాటిపై నిరంతరాయంగా దాడి కొనసాగించడం విమర్శల నోరు నొక్కడం కోసమేనని కూడా తేల్చి చెప్పారు. సాంకేతిక మార్పుల కారణంగానూ సామాజిక అవసరాల కోసం అవతరించిన స్వతంత్ర మీడియా వేదికలు కూడా ఈ దాడిని ఎదుర్కోవడానికి సిద్ధం కావలసి వుంటుందని 'వైర్' సంపాదకుడు సిద్ధార్థ వరదరాజన్ పేర్కొన్నారు. పత్రికా స్వాతంత్ర్యంపై జరిగే దాడికి ప్రతిఘటనలో ఈ అక్టోబరు 3 ఒక వార్షికోత్సవ ఘట్టంగా చూడాల్సి వుంటుందని ప్రముఖ పాత్రికేయుడు పాలగుమ్మి సాయినాథ్ అభివర్ణించారు.



'న్యూస్ క్లిక్'పై దాడి భారతదేశ మీడియా స్వేచ్ఛా సమరంలో అతి దారుణమైన సందర్భం. 1975లో ఎమర్జన్సీ తర్వాత కాలంలో అదే చెప్పుకోవలసిన ఘటన అని 'హిందూ' మాజీ ప్రధాన సంపాదకుడు ఎన్.రామ్ ఈ సందర్భంలో పేర్కొన్నారు. అయితే దీన్ని కేవలం మీడియా వ్యవహారంగానే గాక పోలీసుల పెత్తనంతో సాగిన రాజకీయ కథగా చూడవలసి వుంటుందని ఆయన స్పష్టం చేశారు. వామపక్ష, ప్రజాస్వామిక భావజాలంతో పని చేసే ఓ స్వతంత్ర మధ్యతరహా మీడియా సంస్థపై జరిగిన ఈ దాడి అలాంటి జర్నలిజానికి పొంచి వున్న సవాళ్లకు సంకేతమని రామ్ స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం స్పష్టమైన నిర్దేశిత లక్ష్యంతో భయోత్పాతం సృష్టిస్తూ, దేశ ద్రోహం వంటి కేసులు బనాయిస్తూ మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధులు, మానవ హక్కుల కార్యకర్తలు, పౌర సమాజ సంస్థల వంటి వాటిపై నిరంతరాయంగా దాడి కొనసాగించడం విమర్శల నోరు నొక్కడం కోసమేనని కూడా తేల్చి చెప్పారు.

సిబిఐ కొత్తగా ఎలాంటి సాక్ష్యాధారాలు సేకరించలేకపోయిన కారణంగానే కేసు మూసివేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు సంస్థ వర్గాలు వెల్లడించాయి. కాని దీనిపై కోర్టు తుది నిర్ణయం ప్రకటించాల్సి వుంది. మొత్తం కేసే మూసేస్తారా లేక మరింత దర్యాప్తు కోసం ఆదేశాలిస్తారా చూడాలి. కానీ ఇప్పటికే మోడీ హయాంలో మీడియా అణచివేత ఏ స్థాయిలో వుందో మాత్రం ప్రపంచమంతటికీ తెలిసింది. ఈ పూర్వ రంగంలోనే యు.పి ప్రభుత్వం కులతత్వంతో నడుస్తుందని ఆరోపించినందుకు అభిషేక్ ఉపాధ్యాయ అనే పాత్రికేయుడిపై క్రిమినల్ కేసు మోపడం సరికాదని సుప్రీం చివాట్లు పెట్టడం ఆసక్తికరం.

వాస్తవానికి ఈ నేపథ్యంలోనే మరో ప్రఖ్యాత మీడియా వేదిక పీక నులిమేందుకు మోడీ సర్కారు, కార్పొరేట్ శక్తులు కలిసి సాగించిన మహా పథకం కూడా గుర్తుకు వస్తుంది. కాకుంటే సరిగ్గా ఈ సమయంలోనే ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌లను గత ఏడేళ్లుగా వెంటాడి వేధించిన కక్ష సాధింపు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేతులెత్తేయడం కూడా గమనిస్తాం. ఈ మేరకు ఇది కోర్టులో ముగింపు నివేదిక సమర్పించింది. ఎన్.డి టి.వి లో ప్రణయ్ రాయ్ ప్రయాణం ఆధునిక భారత మీడియా గమనానికి సాక్షీభూతం వంటిది. ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు నుండి తమ వ్యాపార ప్రయోజనాల కోసం రుణాలు తీసుకున్న రాయ్ దంపతులు సెక్యూరిటీలకు సంబంధించిన వివరాలు చెప్పకుండా దాచిపెట్టడం ద్వారా ఆ బ్యాంకుకు రూ.48 కోట్లు నష్టం కలిగించారనేది ఆరోపణ. ఇది ఏ స్థాయిలో ఎన్ని మెలికలతో ముందుకు తెచ్చారో, రాజకీయ వ్యాపార ఘనాపాటీలు ఎందరు కక్షగొండి పనులు చేశారో గుర్తు చేసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇ.డి అధికారికంగా అపజయాన్ని అంగీకరించిన రీత్యా వాటినోమారు నెమరేసు కోవడం అవసరం. లెక్కలు, సాంకేతిక వాదనలు అలా వుంచి సారాంశం ఏమిటో చూద్దాం.

ప్రణయ్, రాధికా రాయ్‌ల సమరం

మీడియా దాడులలో అనేకం కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగితే ఎన్.డి టి.వి కథ ఆయన ప్రధాని అభ్యర్థి అయినప్పుడే మొదలైంది. ఇంకా చెప్పాలంటే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వుండగానే బిజెపి, సంఘ పరివార్ ప్రణయ్ రాయ్‌ని టార్గెట్ చేయడం చూస్తాం. ఇరవయ్యేళ్లకు ముందు స్టార్ టీవీ మర్డోక్ ఇండియాలో ప్రసారాలు ప్రారంభం చేయాలనుకున్నప్పుడే ఆయనతో చర్చలు జరిపిన ప్రణయ్ రాయ్ ఆ షరతులు, పెత్తనం నచ్చక బయటికి వచ్చేశారు. మిత్రులతో కలసి బ్యాంకుల సహకారంతో ఎన్.డి టి.వి ప్రారంభించారు. అప్పట్లో దూరదర్శన్ బయటి సంస్థలతో ఉమ్మడి, ప్రత్యేక స్పాన్సర్డ్ కార్యక్రమాలకు అవకాశమిచ్చేది. ప్రణయ్ రాయ్ 'వరల్డ్ దిస్ వీక్' వంటివి ఈ క్రమంలో బాగా పేరుపొందాయి. సాంకేతిక పరిజ్ఞానం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సమయస్ఫూర్తి కలిగిన ఆయన శైలి వీక్షకులకు కట్టిపడేసి ఐకాన్‌గా మారారు. ఇదంతా కాంగ్రెస్‌కు అనుకూలంగా వారి మద్దతుతోనే చేస్తున్నారని బిజెపి, ఆరెస్సెస్ వర్గాలు, వారి అనుకూల మీడియా అదే పనిగా ప్రచారం సాగించేవి. మనీ లైఫ్ పత్రికలో 2004 లోనే ఇలాంటి కట్టుకథలుల రాస్తే, డిడి డైరెక్టర్ రతికాంత బసు, ప్రణయ్ రాయ్ కూడా తీవ్రంగా ఖండించారు. ప్రణయ్ రాయ్ కేసు వేస్తే కోర్టు ఆ ప్రచారకులను మందలించింది కాని ఆ బృందం అదేపనిగా ప్రచారాలు ఆపలేదు. 2010లోనే సండే గార్డియన్ పత్రిక డిడితో ఒప్పందంపై ఆరోపణలు ప్రచురించింది. బిజెపి ఎంపీగా పని చేసిన ఎడిటర్ ఎం.జె అక్బర్ కుమారుడి ఆధ్వర్యంలోని ఈ పత్రిక రాసిన కథలనే మాజీ కేంద్రమంత్రి యశ్వంత్ సిన్హా పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఆఖరుకు వాటినే గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న మోడీ కూడా 2013లో అంబానీల యాజమాన్యంలోని 'న్యూస్ 18' నిర్వహించిన చర్చలో ప్రస్తావించారు. రాయ్‌లకు సహాయం చేసేందుకే 'ప్రాజెక్టు టైగర్' పేరుతో 200 కోట్లు ఖర్చు కేటాయించినట్లు ప్రణాళికా సంఘంలో చర్చ జరుగుతున్నదని అపహాస్యం చేశారు. ఇదే ఆరోపణలను మధు కిన్వర్ 'మానుషి' పత్రికలో ప్రచురించగా లూత్రా సంస్థ రాయ్‌ల తరపున న్యాయ పోరాటం చేసింది. ఇవే విషయాలను ఆరెస్సెస్ అనధికార వ్యాఖ్యాత ఎస్.గురుమూర్తి, బిజెపి ఎంపీ వీరేంద్ర కపూర్, ఐ.ఆర్.ఎస్ అధికారి ఎస్.కె. శ్రీవాత్సవ కూడా మీడియాలో విస్తారంగా ప్రచారం చేస్తూ వచ్చారు. పి.ఆర్ ఆర్.ఆర్ సంస్థ షేర్లను అధిక విలువ చూపించి అప్పు తెచ్చుకున్నారనీ, ఇక్కడ చూపించిన షేర్లనే మరో చోట కూడా ఉపయోగించారని ఆరోపణ.

ఐక్యరాజ్యసమితి దాకా...

మోడీ అధికారంలోకి వచ్చాక సహజంగానే అదానీ మీడియా రంగంలోకి ప్రవేశించడం, ఇక్కడ ఆర్నబ్ గోస్వామి వంటి వారి ప్రాబల్యం మధ్య ప్రణయ్ రాయ్ ఎదురీత సాగిస్తూ వచ్చారు. నిజానికి రెండు మూడు సార్లు మోడీని కలుసుకోవడం, ఆయన ఆహ్వానంపై గుజరాత్ సందర్శన కూడా చేశారు కానీ విధానాల విషయంలో రాజీ పడలేదు. ఈ నేపథ్యంలోనే 2017లో విదేశీ పర్యటనకు బయలుదేరబోతున్న రాయ్ దంపతులను నిలిపేసి పాత కేసు తిరగదోడారు. దానికి నాలుగు రోజుల ముందే ఎన్.డి టి.వి చర్చలో పాల్గొన్న బిజెపి ఎంపీ సంబిత్ పాత్ర ఛానల్‌పై విశృంఖల ఆరోపణలు చేస్తే బయటకు నడవాలని ఆదేశించారన్నది గుర్తుంచుకోవాలి. అప్పటికే అదానీ ఎ.ఎం.జి మీడియా నెట్‌వర్క్స్ పెట్టుబడుల సంస్థ ప్రారంభించి పలు సంస్థలలో ప్రవేశించారు. విశ్వ ప్రధాన్ కమర్షియల్స్ లిమిటెడ్ (వి.సి.పి.ఎల్) అనే మరో కంపెనీ ద్వారా అక్రమ పద్ధతిలో ఎన్.డి టి.వి ని అధీనంలోకి తెచ్చుకున్నారు. వి.సి.పి.ఎల్ లో అదానీ హస్తం వుందని తెలియని ఆర్.ఆర్ పి.ఆర్ హోల్డింగ్స్ లిమిటెడ్ దానితో కుదిరిన ఒప్పందం మేరకు అప్పు తీసుకుంది. ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకుకు రూ.48 కోట్ల నష్టం తెచ్చిన పాత అప్పునుంచి తప్పించుకోవడానికే ఈకొత్త అప్పు తీసుకున్నారని సి.బి.ఐ కి సంజయ్ దత్ అనే సెక్యూరిటీ ఏజంటు ఫిర్యాదు చేశారు. స్వంతంగా దర్యాప్తు చేయడం తప్ప ప్రైవేటు ఫిర్యాదులపై పెద్దగా రంగంలోకి దిగని సిబిఐ ఇంత ప్రత్యేక శ్రద్ధ చూపడం కేవలం కక్ష సాధింపు కోసమే. సిబిఐ తో పాటు ఇడి మరోకేసు పెట్టడమూ అందుకే. ఈ దొంగ దారి స్వాధీనాన్ని, వేధింపు కేసులను మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. తాను కేంద్రానికి తలవంచలేదు గనకే ఇంత దారుణానికి వొడిగట్టారని అయినా తాను లొంగబోనని రాయ్ ప్రకటించారు. తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదనీ, ఇంతవరకూ అక్రమ ధనం తాకలేదని జాతీయ ప్రెస్‌క్లబ్‌లో విశ్వాసంగా చెప్పారు. 2022 తర్వాత ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌లు ఎన్.డి టి.వి డైరెక్టర్ స్థానాలను కూడా వదులుకుని వచ్చేశారు. దేశంలో మీడియా స్వేచ్ఛపై, మానవ హక్కులపై దాడి గురించి ప్రత్యేకంగా ప్రణయ్ రాయ్‌లపై గురిపెట్టడం గురించి ఐక్యరాజ్యసమితిలో కూడా ప్రస్తావనకు వచ్చిందంటే పరిస్థితి ఎంత దిగజారిందో తెలుస్తుంది. తీరా చూస్తే ఢిల్లీ, డెహ్రాడూన్‌ల లోని రాయ్‌ల నివాసాలతో సహా ఎన్.డి టి.వి కార్యాలయాల పైన, ఖాతాలపైన సిబిఐ విచ్చలవిడిగా గాలింపు జరిపినా ఏమీ దొరక్కపోవడం పాలకులకు చెంపపెట్టు లాంటిది.

ఇకనైనా ముగింపు?

ఎ.ఐ సాయంతో ప్రణయ్ రాయ్ కొత్తగా స్థాపించిన డీ కోడర్ ప్లాట్‌ఫాం ఇప్పుడు నడుస్తూ వుంది. వయసు పెరిగినా మొన్నటి ఎన్నికల తరుణంలోనూ తనదైన విశ్లేషణ ఇచ్చి మెప్పించారు. ఇదిగో ఇలాంటి నేపథ్యంలోనే ఇ.డి రాయ్‌ల కంపెనీపై పెట్టిన కేసు ముగిస్తున్నట్టు ప్రకటించింది. సిబిఐ కొత్తగా ఎలాంటి సాక్ష్యాధారాలు సేకరించలేకపోయిన కారణంగానే కేసు మూసివేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు సంస్థ వర్గాలు వెల్లడించాయి. కాని దీనిపై కోర్టు తుది నిర్ణయం ప్రకటించాల్సి వుంది. మొత్తం కేసే మూసేస్తారా లేక మరింత దర్యాప్తు కోసం ఆదేశాలిస్తారా చూడాలి. కానీ ఇప్పటికే మోడీ హయాంలో మీడియా అణచివేత ఏ స్థాయిలో వుందో మాత్రం ప్రపంచమంతటికీ తెలిసింది. ఈ పూర్వ రంగంలోనే యు.పి ప్రభుత్వం కులతత్వంతో నడుస్తుందని ఆరోపించినందుకు అభిషేక్ ఉపాధ్యాయ అనే పాత్రికేయుడిపై క్రిమినల్ కేసు మోపడం సరికాదని సుప్రీం చివాట్లు పెట్టడం ఆసక్తికరం. ★

పారిశుధ్య కార్మికుల బతుకులు మార్చలేరా?

సమస్య

'దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం ఎంత ప్రధానమో, ప్రజా శ్రేయస్సుకు శుభ్రతతో కూడిన పారిశుధ్యం అంతే ప్రాణ ప్రధానం' అని వందేళ్ల క్రితమే గాంధీ పిలుపునిచ్చారు. అంతేకాదు! ఇంట్లోని మరుగుదొడ్డి, వంటగది శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నొక్కి చెప్పారు. పారిశుధ్య (సఫాయి) కార్మికులు కోడి కూతకు ముందే అపరిశుభ్ర పరిసరాలను, దుర్గంధమయమైన కాలనీలను శుభ్రపరిస్తేనే కదా! ఉదయానికల్లా అందమైన రోడ్లు, వాడలు, కూడళ్లు శుభ్రంగా కళకళలాడేది? వారి సేవలు అనన్య సామాన్యం. పాలకులు మారినా వారి జీవితాల్లో మార్పు లేదు. ఇళ్లు వాకిళ్లతో పాటు పరిసరాలు, గ్రామాలు, పట్టణాలు, నగరాల పరిశుభ్రత పైనే ప్రజారోగ్యం ఆధారపడి ఉంటుంది.

స్వతంత్ర భారతంలో 1981 నాటికి ఒక్క శాతం గ్రామీణ కుటుంబాలకే పారిశుధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేవి. 1986లో గ్రామీణ పారిశుధ్య కార్యక్రమం ప్రారంభించారు. 1999లో సంపూర్ణ పారిశుధ్య ఉద్యమంగా మారింది. 2012 నాటికి పారిశుధ్య వసతులున్న గ్రామీణ కుటుంబాల సంఖ్య 32.7 శాతానికి చేరింది. ఈ నత్తనడక ప్రగతిని వేగవంతం చేయడానికి 2014 అక్టోబర్ 2న, "స్వచ్ఛ భారత్" ప్రారంభిస్తున్నామన్నారు నాటి, నేటి ప్రధాని మోడీ. పారిశుధ్య పనులు, మరుగుదొడ్ల నిర్మాణంలో, వాడకంలో కొంత మేరకు చైతన్యం వచ్చినప్పటికీ, దేశంలో ఇంకా అనేక ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన సమస్యలు తీరనే లేదు. ప్రచారార్భాటమే ఎక్కువగా కనిపించింది.

"స్వచ్ఛ భారత్" కింద జరుగుతున్న నిర్మాణాల నాణ్యతపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ మధ్యనే అసంతృప్తిని వ్యక్తపరిచింది. గ్రామీణ ప్రాంతాలలో మరుగుదొడ్ల వాడకం తగ్గుతున్నదని ప్రపంచ బ్యాంక్ అధ్యయనం నిరుడు పేర్కొంది. అంటే స్వచ్ఛ భారత్ లక్ష్యాలు ఇంకా సంపూర్ణంగా సాధించలేదనేది



వాస్తవం. కానీ మన ప్రధానమంత్రి మాత్రం ఈ ఉద్యమం విజయవంతం అయిందని చెప్పుకుంటున్నారు. ఈ అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజు స్వచ్ఛ భారత్‌కు పదేళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాలలో పిల్లలతోపాటు చీపురు పట్టి ఊడుస్తూ ఇదే చెప్పుకొచ్చారు.

ఈ 'విజయం'లో ప్రధాన భూమిక పోషించిన పారిశుధ్య కార్మికుల మురికి జీవితాల్లో వెలుగులు నింపలేదనేది వాస్తవం. నగరాల్లో, పట్టణాల్లో పారిశుధ్య కార్మికులు చెత్తను డంపింగ్ సైట్లకు చేరుస్తున్నారు. ఇలా గుట్టలు గుట్టలుగా పోగయ్యే చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేయాలన్న ఆశయాలు నెరవేరడం లేదు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో విస్తరించిన 2411 డంపింగ్ సైట్లను శుభ్రం చేయాలి. దేశవ్యాప్తంగా పలు పట్టణాల్లో చెత్త సేకరణ, విభజన జరిగినప్పటికీ పునశ్శుద్ధి చేయడంలో పాలకుల చిత్తశుద్ధి లోపిస్తున్నది. మరోవైపు పారిశుధ్య కార్మికుల ఆర్థిక పరిస్థితి మారడం లేదు. తరతరాలుగా కొన్ని అట్టడుగు, అణగారిన సామాజిక వర్గాల వారే ఈ పనులను చేస్తున్నారు. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు చాలా అధ్వానంగా ఉన్నాయి. 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని తమ భుజాలపై వేసుకొని దేశ ప్రజలంతా ఆదమరిచి నిద్రపోతున్న వేళ వేకువజామునే లేచి అపరిశుభ్ర పరిసరాలలోని చెత్తలను, దుర్గంధాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య (సఫాయి) కార్మికుల మురికి బతుకల్లో వెలుగులు రాలేదు.


గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో, మహా నగరాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వారే 92 శాతానికి పైగా ఉన్నారు. మురుగు నీటి కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే సఫాయి కార్మికుల్లో అధిక భాగం వారే ఉన్నారు. మన దేశంలోని నగరాలు, పట్టణాల నుంచి ప్రభుత్వం సేకరించిన సమాచారం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యు.టి) నుంచి 3 వేలకు పైగా పట్టణ, నగరపాలక సంస్థల్లో ఉన్న కార్మికుల్లో 91.9 శాతం ఎస్.సి, ఎస్.టి, ఒ.బి.సి ల నుంచే ఉన్నారు. వీరిలో ఎస్.సి వర్గం నుంచి అధికంగా 68.9 శాతం ఉండగా, 14.7 శాతం ఒ.బి.సి లు, 8.3 శాతం ఎస్.టి లు ఉన్నారు. 8 శాతం జనరల్ కేటగిరి నుంచి ఉన్నారు. దేశవ్యాప్తంగా 2019 నుంచి 2023 మధ్య ప్రమాదకర పరిస్థితుల్లో మురుగు కాల్వలను, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ 377 మంది చనిపోయారని పార్లమెంటులో ప్రభుత్వం వెల్లడించింది. తరతరాలుగా పారిశుధ్య కార్మికుల మురికి బతుకులను మాత్రం మార్చలేకపోతున్నారు. స్వచ్ఛ భారత్ పేరుతో ప్రచారం కోసం సఫాయి కార్మికుల కాళ్లు కడిగి నీళ్లను తల మీద చల్లుకుంటే సరిపోదు. వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగు పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పారిశుధ్య కార్మికుల చేసే పనుల్లో ఎన్నో నూతన యంత్రాలను ప్రవేశ పెట్టి వారు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. వారి వేతనాలు పెంచి గౌరవం, భరోసా, భద్రత కల్పించి వారి బతుకుల్లో వెలుగు నింపాలి. సఫాయి కార్మికులు యాచకులు కాదు. వారి వెల కట్టలేని శ్రమ శక్తిని గుర్తించి న్యాయం చేయాలి.

- మేకిరి దామోదర్, సెల్ : 9573666650

పేదల పక్షపాతి

సందర్భం

కొందరికి పదవుల వల్ల గుర్తింపు లభిస్తుంది. మరికొందరు ఆ పదవులకే గుర్తింపు తెస్తారు. రెండవ కోవకి చెందిన వారు ఎస్.ఆర్. శంకరన్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా శంకరన్ బాధ్యతలు నిర్వహించిన సందర్భంలో దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసే అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఒక్క ఏడాదిలోనే 120కి పైగా జీవోలు జారీ చేసిన ఘనత ఆయనది. హరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖను సాంఘిక సంక్షేమ శాఖగా మార్చడానికి సంబంధించిన జీవో వాటిలో ఒకటి. సమీకృత ఆదివాసీ అభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ) లను ఏర్పాటు చేయడంలో, గిరిజన ఉప ప్రణాళికలను ప్రవేశ పెట్టడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు.



అక్టోబర్ 7న శంకరన్ వర్ధంతి

1984లో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. ఐ.ఎ.ఎస్ అధికారులు సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు ఏ స్థాయిలో సేవ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చో ప్రత్యక్షంగా ఆచరించి చూపారు.

శంకరన్, తమిళనాడులోని తంజావూరులో 1934 అక్టోబర్ 22న మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1956లో ఐ.ఎ.ఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 1959లో కర్నూల్ జిల్లా నంద్యాల సబ్ కలెక్టర్‌గా, తర్వాత నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. 1971-73 మధ్య కాలంలో కేంద్ర బొగ్గు, గనుల మంత్రిగా ఉన్న కుమారమంగళం దగ్గర స్పెషల్ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన కాలంలో బొగ్గు గనులను జాతీయం చేయటంలో ఆయన పాత్ర అత్యంత కీలకమైనది. బొగ్గు గని కార్మికులను బానిసలుగా చూస్తున్న స్థితిలో వారికి రాజ్యాంగపరమైన హక్కులను కల్పించడంలో ఆయన కృషి అభినందనీయం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సందర్భంలో శంకరన్ దళిత, ఆదివాసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధికి బాటలు వేసే అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఒక్క ఏడాదిలోనే 120కి పైగా జీవోలు జారీ చేసిన ఘనత ఆయనది. అందులో 100కి పైగా ఉత్తర్వులు ఆయన సంతకంతోనే ఉంటాయి. హరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖను సాంఘిక సంక్షేమ శాఖగా మార్చడానికి సంబంధించిన జీవో ఆయన జారీ చేసిన వాటిలో ఒకటి. ఆదివాసీల కోసం సమీకృత ఆదివాసీ అభివృద్ధి సంస్థ (ఐటిడిఎ)లను ఏర్పాటు చేయడంలో, గిరిజన ఉప ప్రణాళికలను ప్రవేశ పెట్టడంలో ముఖ్యపాత్ర పోషించారు. 1984లో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక అంశాలలో రాణించటానికి తగిన విధానాలు రూపొందించారు. 1976లో వచ్చిన వెట్టిచాకిరీ నిషేధ చట్టం అయన కృషి ఫలితమే. త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసినప్పుడు అక్కడ కేంద్ర పారా మిలిటరీ దళాల అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు తన శక్తి మేరకు ప్రయత్నం చేశారు.

భారత ప్రభుత్వం శంకరన్ సేవలను గుర్తించి 2005లో పద్మభూషణ్ అవార్డును ప్రకటించగా సున్నితంగా తిరస్కరించి తన నిరాడంబరతను చాటుకున్నారు. ఖమ్మం ఆదిలాబాద్ జిల్లాల్లో పని చేస్తున్నప్పుడు ఆయనను బదిలీ చేయగా దానికి నిరసనగా ప్రజలు ఆందోళనకు దిగడం, వారికి ఆయనపై ఉన్న అచంచల విశ్వాసానికి, నమ్మకానికి నిదర్శనం. ఏ రోజూ ఆయన తన స్వంత పనులకు ప్రభుత్వ వాహనాన్ని వాడుకోలేదు. బిళ్ళ బంట్రోత్ లేకపోతే ఆయనను కలెక్టర్‌గా గుర్తించడం కూడా కష్టమే. అంత సాధారణమైన జీవితాన్ని అయన గడిపేవారు. తనకంటూ సొంత ఇల్లు కూడా ఏర్పరచుకోని నిరాడంబరి. అందుకే పని చేసిన ప్రతి చోటా ప్రజలు ఆయనను 'ఐ.ఎ.ఎస్ గాంధీ' అని పిలిచేవారు. పదవీ విరమణ అనంతరం తనకు వచ్చిన పెన్షన్ కూడా పేద ఎస్.సి, ఎస్.టి విద్యార్థుల చదువుల కోసం ఖర్చు పెట్టేవారు. పదవీ విరమణ అనంతరం, ప్రభుత్వానికి నక్సలైట్లకు మధ్య జరిగిన పోరులో ప్రాణాలు కోల్పోతున్న ప్రజల కోసం మానవతా దృక్పథంతో మేధావులతో కూడిన పౌర స్పందన వేదికను ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి, నక్సలైట్లకు మధ్య చర్చలు జరగడంతో ముఖ్యమైన భూమిక పోషించారు. దళిత, మానవ హక్కుల కార్యకర్త బెజవాడ విల్సన్‌తో కలిసి 'సఫాయి కర్మచారి ఆందోళన్' అనే సంస్థను స్థాపించి సఫాయి పనివారి విముక్తి కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించి...ప్రభుత్వం వారి సంక్షేమం మీద దృష్టి సారించేలా చేశారు. ఆ ఉద్యమం వల్ల ఎంతోమంది చేతితో మలం ఎత్తే అమానవీయ విధుల నుంచి విముక్తి పొందారు. 1985లో కారంచేడు ఘటన అనంతరం బాధితులకు పునరావాసం కల్పించడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు.

ప్రజా సంక్షేమానికే పూర్తికాలం అంకితమైన ఆయన 2010 అక్టోబర్ 7న తుది శ్వాస విడిచారు. ప్రజల ఐ.ఎ.ఎస్ అధికారిగా, మహోన్నత మానవతావాదిగా చరిత్రలో నిలిచిన శంకరన్ జీవితం నేటి తరం అధికారులకు, సామాజిక ఆర్థిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నవారందరికీ స్ఫూర్తిదాయకం.

- యం. రాంప్రదీప్, సెల్ : 9492712836

సెబీ చీఫ్‌కు సమన్లు

- హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో పిఎసి నిర్ణయం



న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణల నేపథ్యంలో చెలరేగిన వివాదంపై ఈ నెల 24న తన ఎదుట హాజరు కావాలని సెబీ అధిపతి మాధబి పురి బచ్‌ను పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) ఆదేశించింది. ఆర్థిక వ్యవహారాలు, రెవెన్యూ శాఖల అధికారులు కూడా హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసింది. పిఎసికి ప్రస్తుతం కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నేతృత్వం వహిస్తున్నారు. అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఇందులో సభ్యులు. దర్యాప్తు సంస్థ పనితీరుకు సంబంధించిన ఆధారాలను నమోదు చేసే నిమిత్తం తన ఎదుట హాజరు కావాల్సిందిగా వీరికి పీఏసీ సమన్లు జారీ చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కూడా పీఏసీ సభ్యులు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధిస్తారు. అదానీ గ్రూప్ కంపెనీలకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయడంలో సెబీ నిష్పాక్షిక పనితీరును వీరు ప్రశ్నిస్తారని తెలుస్తోంది. బచ్ దంపతులపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై పార్లమెంటరీ కమిటీ చేత విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తమపై వచ్చిన ఆరోపణలను బచ్, ఆమె భర్త ఓ సంయుక్త ప్రకటనలో తోసిపుచ్చారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలను అదానీ గ్రూప్ కూడా ఖండించింది. బచ్‌ను విచారణకు పిలవాలని పీఏసీలోని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టగా బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

మేం సహనం కోల్పోయాం...

- వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీపై సుప్రీ కోర్టు
- నవంబర్ 19లోగా చర్యలు తీసుకోవాలి
- లేదంటే కోర్టు ధిక్కార నేరం కింద నోటీసులు ఇస్తాం
- కేంద్రం చిత్తశుద్ధి లేమిపైనా ఆక్షేపణలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రేషన్ కార్డుల కోసం ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులకు కార్డుల జారీలో జాప్యం చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర సహనం వ్యక్తం చేసింది. రాష్ట్రాల తీరు ఆందోళనకరమని, ఈ విషయంలో తాము సహనం కోల్పోయామని, ఓపిక నశించిందని, ఇదే మీకు చివరి అవకాశమని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం అర్హులైన వలస కార్మికులకు రేషన్ కార్డుల మంజూరులో జాప్యాన్ని గమనించిన సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించింది. నవంబర్ 19 లోగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యుటిలు) ప్రభుత్వాలకు తుది అవకాశం ఇచ్చింది. చర్యలు లేని పక్షంలో కోర్టు ధిక్కార నేరం కింద డిఫాల్ట్ రాష్ట్రాల కార్యదర్శులకు సమన్లు పంపుతామని ధర్మాసనం హెచ్చరించింది. తాము సహనం కోల్పోయామని, ఇక భోగము ఉండదని స్పష్టం చేసింది. "ఈ అంశంలో ఎలాంటి ఉదాసీనతకు చోటు లేదని మరోసారి స్పష్టంగా చెబుతన్నాం. ఇక మాకు ఓపిక నశించింది. మా ఉత్తర్వులను పాటించేందుకు మీకు చివరి అవకాశం ఇస్తున్నాం. లేదంటే ఈ కార్యదర్శులు కోర్టుకు రావాల్సి ఉంటుంది" అని సుప్రీం కోర్టు ధర్మాసనం హెచ్చరించింది.

ఇదేనా కేంద్రం సీరియస్ నెస్?

కేంద్ర ప్రభుత్వం తరపు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ "రాష్ట్రాలు స్పందించాలి. కట్టుబడి ఉండాలి. ఇది డైనమిక్ ప్రక్రియ" అని అన్నారు. అంత్యోదయ అన్న యోజన (సమాజంలోని నిరుపేద వర్గాలకు రేషన్ పంపిణీ పథకం) కింద ప్రాధాన్యత కలిగిన ప్రతి ఇంటికి ఒక రేషన్ కార్డు మాత్రమే జారీ చేయనున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇతర సభ్యులకు కార్డులు జారీ చేయకపోవడం కోర్టు ఆదేశాలను ధిక్కరించినట్లేనని ధర్మాసనం పేర్కొంది. అర్హులైన వలస కార్మికులకు ఇంకా జారీ చేయని రేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాలను హెచ్చరించామని అశ్వర్య భాటి పేర్కొన్నారు. దీనికి జస్టిస్ అమానుల్లా "ఇదేనా కేంద్ర ప్రభుత్వ శ్రద్ధ? ఇదేనా మీ సీరియస్‌నెస్? పేదలలోని నిరు పేదల గురించి. క్యాబినెట్ సెక్రటరీ సమావేశాలు ఎందుకు నిర్వహించలేరు? ఎందుకంటే ఇది వారికి ముఖ్యం కాదు?" అని ఆక్షేపించారు. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 19న జరగనుందని, ఆ లోపు చర్యలు తీసుకోవాలని సూచించింది. వలస కార్మికులకు రేషన్‌కార్డులు అందించాలన్న ఏడాది నాటి ఆదేశం ఇంకా అమలు కాలేదని పేర్కొన్న ధర్మాసనం, రెండు నెలల్లోగా పేర్కొన్న కసరత్తును పూర్తి చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ , సామాజిక కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృతా జోహ్రీలు ఈ కేసులో వలస కార్మికుల తరపున వాదించారు.

కరోనా సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సుప్రీం కోర్టు 2020 మే 26న దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా ఈ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం రేషన్ కార్డులు జారీ చేయాలని 2021లో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ ప్రక్రియను పూర్తిగా చేయగా, మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జాప్యం చేస్తున్నాయని, దీంతో సుప్రీం కోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది.

డ్రగ్స్ సొమ్ముతో ఎన్నికల్లో పోటీ..

- కాంగ్రెస్‌పై మోడీ ఆరోపణలు



ముంబయి : డ్రగ్స్ సొమ్ముతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని ప్రధాని మోడీ విమర్శించారు. ఇటీవల ఢిల్లీలో రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత కేసులో ఓ కాంగ్రెస్ నేత ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం మహారాష్ట్రలోని వాసింలో నిర్వహించిన సభలో పాల్గొన్న ప్రధాని ఈ డ్రగ్స్ కేసు గురించి ప్రస్తావించారు. యువతను కాంగ్రెస్ పార్టీ మాదకద్రవ్యాల వైపు నెట్టి.. ఆ సొమ్ముతో ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని భావిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను అర్బన్ నక్సల్స్ ముఠా పాలిస్తోందని.. ఆ పార్టీ ప్రమాదకరమైన ఎజెండాను ఓడించేందుకు ప్రజలంతా ఏకం కావాలని మోడీ పిలుపునిచ్చారు. భారతదేశాన్ని ఎప్పటికీ ఒకే కుటుంబం పాలించాలని వారు భావిస్తారని ఆరోపించారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ స్థానికంగా ఉన్న జగదాంబ మాత ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సంత్ సేవా లాల్ మహారాజ్ సమాధి వద్దకు వెళ్లి సంప్రదాయ ఢంకా వాయించారు. బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రారంభించారు. ముంబయిలో మొట్టమొదటి భూగర్భ మెట్రో లైన్‌ను ప్రారంభించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 18వ విడత నిధులు విడుదల చేశారు. దీని ద్వారా సుమారు 9.4 కోట్ల మంది రైతులకు రూ.20,000 కోట్ల సహాయం అందింది. సరిగ్గా ఎన్నికల ముందు ప్రధాని విపక్షాలను టార్గెట్ చేయటం, పలు పథకాలకు మోడీ శంకుస్థాపనలు చేయటం ఆనవాయితీగా మారింది. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం కూడా వంత పాడుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



ఇప్పుడు తలవంచి నమస్కరిస్తే లాభమేంటి..?

- ప్రధానిపై రాహుల్ విమర్శలు

ముంబయి : బిజెపి ప్రభుత్వం ప్రజలను భయపెట్టడంతో పాటు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనను ఉద్దేశిస్తూ.. బిజెపి సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రజలను భయపెడుతూ, రాజ్యాంగాన్ని, ఆయా సంస్థలను నాశనం చేస్తూ.. ఇప్పుడు ఛత్రపతి శివాజీ ఎదుట తలవంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. శివాజీ అందించిన సందేశం దేశమంతటికీ వర్తిస్తుంది. ఛత్రపతి, షాహూ మహరాజ్ లాంటి యోధులు లేకపోయి ఉంటే.. నేడు మనకు రాజ్యాంగం ఉండేది కాదు" అని ప్రధాని మోడీని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు. రాజ్‌కోట్ కోటలో ప్రధాని ప్రారంభించిన 35 అడుగుల శివాజీ విగ్రహం కొంతకాలంలోనే గత ఆగస్టులో కుప్పకూలిన నేపథ్యంలో మోడీ స్పందిస్తూ తాను ఇందుకు తల వంచి క్షమాపణలు కోరుతున్నానని పేర్కొన్న సంగతి విదితమే.

ప్రభుత్వ విద్యే కావాలి !

- అర్జెంటైనాలో విస్తరిస్తున్న ఆందోళనలు
- విశ్వవిద్యాలయాల రద్దుకు వ్యతిరేకంగా ర్యాలీలు

బ్యూనస్ ఎయిర్స్ : ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం అర్జెంటైనాలో ఆందోళనలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. వేలాదిమంది ప్రజానీకం వీధుల్లోకి వచ్చి విద్యా ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గళమెత్తుతున్నారు. ఈ క్రమంలోనే రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో శనివారం అతిపెద్ద ప్రదర్శన జరిగింది. ప్రభుత్వ విశ్వవిద్యాలయ విద్యను రద్దు చేయాలని జేవియర్ మిలీ నయా ఉదారవాద ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వినాశకర ఈ విధానాలను తక్షణమే విడనాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ కాంగ్రెస్ వరకు సాగిన ఈ ప్రదర్శనలో పలు రాజకీయ పార్టీల నేతలు, సామాజిక ఉద్యమకారులు, యూనియన్లు, మానవ హక్కుల సంఘాల నేతలు విద్యార్థులు, ప్రొఫెసర్లు, గ్రాడ్యుయేట్లు, యూనివర్శిటీ సిబ్బందితో చేతులు కలిపారు. రోజారియో, కార్డోబా, శాన్‌మిగ్వెల్, తదితర నగరాల్లో కూడా ప్రదర్శనలు జరిగాయి. అర్జెంటైనా విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న అవసరాలను దృష్టిలో వుంచుకుని యూనివర్శిటీ బడ్జెట్‌ను పెంచాలని కోరుతున్న యూనివర్శిటీ ఫైనాన్సింగ్ లాను అధ్యక్షుడు మిలీ వీటో చేయరాదని వారు డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది. కానీ ఇది ఆచరణ సాధ్యం కానిదిగా వుందంటూ మొత్తంగా ఈ చట్టాన్ని వీటో చేయాలనుకుంటున్నానని అధ్యక్షుడు ప్రకటించారు. ఈ చట్టాన్ని వర్తింపచేసినట్లైతే, జిడిపిలో ప్రజా వ్యయం చాలా స్వల్పంగా పెరుగుతుందని ఇందుకు సంబంధించిన నిపుణులు తెలియచేస్తున్నారు. అనేక సంవత్సరాలుగా అర్జెంటైనాను విశృంఖలమైన ద్రవ్యోల్బణం పట్టి పీడిస్తున్నప్పటికీ బడ్జెట్‌లో ఉద్యోగాలు వేతనాలు గణనీయంగా పెరగలేదని ప్రదర్శనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల యూనివర్శిటీ సిబ్బంది కొనుగోలు సామర్ధ్యం క్షీణిస్తోందని, దాంతో వారు ఇతర ఉద్యోగాలను వెతుక్కోవాలని చూస్తున్నారని, పైగా దీనివల్ల విశ్వవిద్యాలయాల పని సామర్ధ్యం బాగా దెబ్బతింటోందని చెప్పారు. తమ అవసరాలు తీరేలా ఇతర ఉద్యోగాలను వెతుక్కోవడంపై దృష్టి పెట్టడంతో వారు తరగతుల్లో బోధనకు సరిగా సన్నద్ధమవలేకపోతున్నారని తెలిపారు. దీనివ్ల విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయన్నారు. అదే సమయంలో విద్యార్థులు తమ పరిశోధనలు మెరుగుపడేలా బడ్జెట్‌ను మెరుగుపరచాలని కోరుతున్నారు. ఈ ప్రభుత్వం నిలకడ లేని రీతిలో వ్యవహరిస్తోంది. విద్యార్థులపై, విశ్వవిద్యాలయాలపై, విద్యపై, ఈ దేశ ప్రగతిపై ప్రభుత్వానికి అస్సలు దృష్టి లేదని వారు విమర్శిస్తున్నారు.

నామినేట్‌తో బిజెపి రాజకీయం

- జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో పాగా కోసం ఐదుగురు సభ్యుల నామినేట్
- గతంలో ఢిల్లీలో ఇదే ఎత్తుగడతో అభాసుపాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్ముకాశ్మీర్‌లో శాసన సభకు ఐదుగురు సభ్యులను నామినేట్ చేసేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి)కు అధికారం ఇచ్చిన శాసన సవరణలను దుర్వినియోగం చేయడంతో ప్రజల తీర్పును తారుమారు చేసేందుకు బిజెపి, కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. పదేళ్ల తరువాత జరిగే ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో ఐదుగురు సభ్యులను నామినేట్ చేసేందుకు ఎల్‌జి ముందుకు వచ్చారు. వారికి కూడా అసెంబ్లీలో ఓటు హక్కు కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019 అసెంబ్లీలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లేకపోతే ఇద్దరు మహిళలను నామినేట్ చేయడానికి లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారం ఇచ్చారు. 2023 సవరణ ప్రకారం ఇద్దరు వ్యక్తులను కాశ్మీరీ వలసదారుల ప్రతినిధులుగా, ఒకరిని పాక్ అధీనంలో ఉన్న కాశ్మీర్ (పిఒకె) ప్రతినిధిగా ప్రతిపాదించారు. సాధారణంగా ప్రభుత్వం ఏర్పడిన తరువాత శాసన సభల్లో సభ్యుల నామినేట్ చేయడం జరుగుతుంది. వారికి ఓటు హక్కు, లేదా ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో పాల్గొనడానికి వీలులేదు. కానీ, జమ్మూ కాశ్మీర్ శాసనసభను పుదుచ్చేరి తరహాలో తీర్చిదిద్దామని, నామినేటెడ్ అభ్యర్థులకు కూడా ఓటు హక్కు ఉంటుందని కేంద్రం కుట్ర పన్నుతూ వాదనలకు తెరలేపింది. 90 మంది సభ్యుల జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో పూర్తి మెజారిటీకి 46 మంది సభ్యుల మద్దతు అవసరం. నామినేటెడ్ సభ్యులు కలిపితే 48 పెరుగుతుంది. ఈ క్రమంలోనే హంగ్ అసెంబ్లీ ఏర్పడితే అధికార దుర్వినియోగానికి పాల్పడి బిజెపి అసెంబ్లీని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. జమాతే ఇస్లామీ స్వతంత్రులు, ఇంజనీర్ రషీద్ పార్టీకి చెందిన వారికి కేంద్ర ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. వారిని లాక్కోవడానికి ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఎం, పిడిపిలు ప్రభుత్వ ఏర్పాటుకు ముందు ఐదుగురు సభ్యులను నామినేట్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని విమర్శించారు. 2023లో కూడా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్నిక విషయంలో కూడా లెఫ్టినెట్ గర్నవర్ వికె సక్సేనా ద్వారా బిజెపి ఇదే రకమైన కుట్రలకు పూనుకుంది. పది మంది మున్సిపల్ కౌన్సిలర్లను నామినేట్ చేసి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి బిజెపి చేజిక్కించుకోవడానికి ప్రయత్నించింది. అయితే అప్పుడు ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీంతో సుప్రీం కోర్టు జోక్యంతో బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. నామినేట్ చేసే కౌన్సిలర్లకు ఓటు హక్కు లేకుండా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ రకంగా ఒకసారి ఎదురుదెబ్బ తగిలిన బిజెపికి బుద్ధి రాలేదు.

బెంగాల్‌లో తొమ్మిదేళ్ల బాలికపై హత్యాచారం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి చేసి, హత్య చేసిన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హత్యాచార ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు శనివారం ఉదయం పోలీస్ ఔట్‌పోస్టుకు నిప్పు పెట్టారు. ఈ దారుణ సంఘటనపై స్థానిక పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బాలిక కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అందించిన సమాచారం ప్రకారం... శుక్రవారం మధ్యాహ్నం బాలిక కోచింగ్ కేంద్రానికి వెళ్లింది. ఆమె ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెదకడం ప్రారంభించారు. అయినా ఆమె జాడ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. అయితే మరో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా పోలీసులు వారికి సలహా ఇచ్చారు. కాగా, బాలిక మృతదేహం శుక్రవారం రాత్రి ఓ చెరువులో లభ్యమైంది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్ద సంఖ్యలో శనివారం ఉదయం కర్రలు, కట్టెలతో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అరిష్ బిశ్వాస్‌ను ఘెరావ్ చేశారు. పోలీస్ ఔట్‌పోస్టుపై దాడి చేసి, దానికి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో అనేక కీలక పత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. చివరికి పోలీసులు లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకూ ఒకరిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.



మీకోసం

అరటి పండ్లు త్వరగా పాడవకుండా ఉండాలంటే, వాటిని ఉప్పు కలిపిన నీటిలో వేసి ఉంచాలి.

జీవన సౌరభం

మనలోని లోపాలు, బలహీనతలను మనం తెలుసుకోవడమే గొప్ప చదువు.

విరినవ్వు



చెట్టుకొమ్మను వంచి
సీత పట్టెను సంచి
పూలు గుసగుసలాడ
చెవులనానించె!

'సీతమ్మ ఈ పూలు
దండ కుడతావా?
వాడిపోమే మేము
విడిచి పెడతావా?'

'గంపగంపల కొలది
మీరు పూస్తారు!
చెట్టుకొమ్మల నుండి
మమ్ము చూస్తారు!
రంగురంగుల
బట్టలను తొడుగుతారు
రండిరండన్నట్టు
పిలుస్తుంటారు!'

'తల్లి ఒడిలో మాకు
క్షేమమ్ము కాదా!
గిల్లి దండలు కుట్ట
ప్రాణమ్ము పోదా!


'చెట్టుసిగలో మేము
మురిసిపోతాము
తేనెటీగలకెల్ల
విందు చేస్తాము
చెట్టు తల్లికి ఫలము
లందజేస్తాము
విత్తనాలను మోయు
బుట్టలౌతాము!'

'తరుసంపదకు మీరు
సాయపడతారు!
తీయతీయని పండ్లు
పంచుతుంటారు
కొన్ని విత్తులు తీసి
నాటి వస్తాను
అందాల విరులార
పోయి వస్తాను'

సీత మాటలవిన్న
విరులన్ని కూడి
సిరినవ్వు నవ్వాయి
తలలూపినాయి!

- కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రామభద్రపురం,
విజయనగరం జిల్లా.

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ





వై. ఉన్నతి,
4వ తరగతి, జెమినీ స్కూల్,
బ్రాడీపేట, గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'సైబర్' నేరాలపై అప్రమత్తత అవసరం



అధునాతన టెక్నాలజీని వాడుకుంటూ నిత్యం కొత్త ఎత్తుగడలతో ఎవరూ ఊహించని విధంగా సైబర్ నేరగాళ్లు పంజా విరుచుకుపడుతున్నారు. డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఆశచూపి ఈ మోసాలకు తెగబడుతున్నారు. బాధితులు తెలుసుకునే లోపే వారి కష్టార్జితాన్ని కొల్లగొట్టేస్తున్నారు. బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ఐవిఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) కాల్స్ ద్వారా ఎరవేసి డబ్బులు దోచేస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన లేకపోవటంతో కేటుగాళ్ల పని సులువు అవుతోంది. బాధితులు కళ్లు తెరిచే సరికే డబ్బుఖాతాలు దాటిపోతోంది. తాము ఫలాన బ్యాంకు నుంచి అని వచ్చే రికార్డు వాయిస్‌తో బురిడీ కొట్టిస్తున్నారు. మన లావాదేవీలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వచ్చే ఐవీఆర్ కాల్స్‌కు స్పందించకపోవటం ఉత్తమం. తాము బ్యాంకు నుంచి చేస్తున్నామని నమ్మించి ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలను రాబట్టమో లేదా చెల్లింపులు చేసేలా చేస్తారు. మీ ఖాతాకు సంబంధించి అనుమానాస్పద లావాదేవీ జరిగిందని చెబుతూ ఎరవేస్తారు. దీనిపై దర్యాప్తు చేయాలని ఒత్తిడి చేస్తుంటారు. ఇలాంటి సమాచారం గురించి ఎవరు అడిగినా స్పందించాల్సిన అవసరం లేదు. అనుమానం వస్తే తక్షణమే సంబంధిత బ్యాంకు బ్రాంచికిగానీ, ఆ బ్యాంకు హెల్ప్‌లైన్ నంబరుకు కానీ కాల్ చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవటం ఉత్తమం. ఏవైనా మోసపు లావాదేవీలు జరిగితే వెంటనే సంబంధిత వ్యాలెట్ యాప్‌లోని హెల్ప్ అండ్ సపోర్ట్ ఆప్షన్‌పై క్లిక్ చేసి మోసం గురించి ఫిర్యాదుచేయాలి. మన ఫోన్లలోని కనిపించే అనుమానాస్పద గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేస్తే ఈ తరహా మోసాల భారి నుంచి కొంతమంది వరకూ తప్పించుకోవచ్చు.

సైబర్ దొంగల సరికొత్త అవతారం

ఫోన్‌నంబర్లను సోషల్‌మీడియా వేదికల నుంచి సేకరిస్తూ పని కానిచ్చేస్తున్నారు. కొత్తగా బ్యాంకు ఖాతా ప్రారంభించినా 'ఖాతాను తెరిచింది మీరేనా' అయితే 'అవును' లేదా 'కాదు' అనే ఆప్షన్ నొక్కండి అని రికార్డ్ కాల్స్ వస్తున్నాయి. ఇలా మాటల్లోకి దింపి ఆధార్, బ్యాంక్, ఐఎఫ్ఎస్‌సి కోడ్‌లు ఇలా వ్యక్తిగత వివరాలన్నీ సేకరించి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. అందుకే ఫేస్‌బుక్‌లో వస్తున్న ప్రతి ఒక్క మెసేజ్‌కి రిప్లై ఇవ్వకుండా ఉండటమే మంచిది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- మీకు ఎవరైనా మేము పోలీసులమంటూ పార్శిల్ పంపించారనీ, అందులో డ్రగ్స్, ఆయుధాలు ఉన్నాయంటూ కేసు నమోదుచేశామని కాల్ చేస్తే స్పందించొద్దు
- తక్కువ వడ్డీకి, ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా లోన్ ఇస్తామని చెప్పే లోన్ యాప్‌లను నమ్మొద్దు
- పార్ట్‌టైమ్, వర్క్‌ఫ్రం హోమ్ అంటూ ప్రొడక్ట్స్, హోటళ్లకు రేటింగ్, లైక్స్ ఇవ్వటం ద్వారా డబ్బులు వస్తాయని చెప్పే యాప్స్, వెబ్‌సైట్లను నమ్మొద్దు
- మీ పాస్‌వర్డ్‌లను అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక చిహ్నాలు కలిపి ఉండేలా బలమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోండి. తరచుగా వాడుతున్న పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండండి.
- మీ కంప్యూటర్, మొబైల్‌ఫోన్, ఇతర పరికరాలను, సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు యాంటీవైరస్ ఉపయోగించి అప్‌డేట్ చేసి మాల్‌వేర్‌లను రానివ్వకుండా చూసుకోండి
- అనుమానాస్పద వీడియో కాల్స్, లింక్స్, ఎపికె ఫైల్స్, యాప్స్ మాల్స్, మెసేజ్‌లను తెరవడం ద్వారా మీ ఫోన్ సైబర్ కేటుగాళ్ల చేతుల్లోకి అందించకండి.
- సోషల్ మీడియా యాప్‌లో ప్రొఫైల్ లాక్‌తోపాటు టు స్టెప్ వెరిఫికేషన్ పాస్వర్డ్‌లను పెట్టుకోండి. మీ వ్యక్తిగత ఫొటోలను, వీడియో, ఫొటోలను తెలియని వారికి షేర్ చేయొద్దు.
- అనుమానాస్పద లింక్స్, ఎపికె ఫైల్స్ , యాప్స్ డౌన్‌లోడ్ కాకుండా మీ ఫోన్ సెక్యూరిటీ సెట్టింగ్స్ 'ఆన్'లో ఉంచండి.
- రైల్వేస్టేషన్, బస్టాండ్, ఇతర పబ్లిక్ స్థలాల్లో వైఫైను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోండి. మీ సొంత చార్జర్‌ను మాత్రమే వాడండి
- సురక్షితమైన https:// సైట్‌లను మాత్రమే ఉపయోగించండి. గుర్తింపు పొందని సైట్‌లను వాడొద్దు
- ఫోన్ పే, గూగుల్‌పే, స్కానర్‌ల ద్వారా పేమెంట్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించండి. మీ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పంచుకోకూడదు.
- సైబర్ నేరం జరిగిన వెంటనే గోల్డెన్‌అవర్‌లో 1930కి ఫిర్యాదు చేయడం, policestation/ https:// cyber crime.gov.in లో రిపోర్టు చేయాలి.
- ఎవరైనా ఫోన్‌పోతే వెంటనే మీ ఫోన్‌లో ఉన్న నంబరుతో అనుసంధానమైన అకౌంట్‌లను బ్లాక్ చేయించాలి. ఫోన్ గురించి CEIR పోర్టల్‌లో ఫిర్యాదుచేసి IMEI లను బ్లాక్ చేస్తే ఫోన్‌ను త్వరగా పొందొచ్చు.



'సైబర్ సిటిజన్'తో రక్షణ

డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌టిఆర్ జిల్లాలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆధ్వర్యంలో ఈ సిటిజన్ చార్టర్ అప్లికేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించటానికి పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నాం. రెండునెలల్లో 2 లక్షల మందికి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఇప్పటివరకూ 82 వేలమందికి అవగాహన కల్పించాం. ఇప్పటికే సైబర్ సోల్జర్స్‌గా 2000 మంది ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో పనిచేస్తున్నారు. వీరిలో విద్యార్థులు, మహిళలు, గ్రామస్థాయిలో మహిళా పోలీసులు (డబ్లుఎంఎస్‌కె), పట్టణాల్లో (ఎంఎస్‌కెలు) ఉన్నారు. వీరందరినీ 200 మంది సైబర్ కమాండోలు మానిటరింగ్ చేస్తున్నారు. ప్రతీవారంలో నాలుగురోజులపాటు విద్యాలయాలు, కళాశాలలు, యూనివర్శిటీలలో 'సైబర్ నేరాలు–నియంత్రణ పద్ధతులు'పై సెమినార్లు, సదస్సులు నిర్వహిస్తున్నాం. రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, వీధుల్లో ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటుచేశాం. ప్రతి సెంటరులోనూ, వీధుల్లోనూ కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. దసరా నవరాత్రి ఉత్సవాల్లో కూడా భక్తులు, యాత్రికులు మోసపోకుండా దుర్గగుడి, విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు, ఇతర చారిత్రక ప్రాంతాల వద్ద కూడా 150 అవగాహన బోర్డులు ఏర్పాటుచేశాం. మైకుల ద్వారా ప్రచార కార్యక్రమాలు సైతం ఏర్పాటుచేయిస్తున్నాం. సైబర్ పోలీసుల వివరాలను తెలియజేస్తూ విజిటింగ్ కార్డులను సైతం అందజేస్తున్నాం. సైబర్‌కేటుగాళ్ల బారి నుంచి ప్రజలను రక్షించటానికి సైబర్ క్రైమ్ విభాగం ద్వారా 14 రకాల సిమిలేషన్ ఎక్సర్‌సైజ్‌లు చేయించి అవగాహన పొందిన ప్రతిఒక్కరి ఫోన్‌లో దీనిని ఇన్‌స్టాల్ చేయిస్తున్నాం. అవగాహన పొందిన వారికి ఓ సర్టిఫికెట్ కూడా అందజేస్తున్నాం. చోరీకి గురైన 400 ఫోన్లను ఇటీవలే బాధితులకు అందజేశాం. అక్టోబర్ నెలంతా ప్రపంచవ్యాప్తంగా (గ్లోబల్‌మంత్) సైబర్ క్రైమ్‌పై అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయి.



- బి.గుణరాము, ఇన్‌స్పెక్టర్,
విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు

లెబనాన్‌పై దాడులు ఉధృతం

- ప్రతిఘటిస్తున్న హిజ్బుల్లాలు
- సెంట్రల్ గాజాను ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ హుకుం
- గాజాపై దాడుల్లో 9మంది మృతి

బీరుట్, గాజా : లెబనాన్ దక్షిణ సరిహద్దు ప్రాంతంపై ఇజ్రాయిల్ భీకర దాడులను కొనసాగిస్తోంది. శత్రువుల దాడిని తిప్పికొట్టేందుకు హిజ్బుల్లాలు యత్నిస్తున్నారు. మరో వైపు సెంట్రల్ గాజాను ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ హుకుం జారీ చేసింది. లెబనాన్ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో ఉత్తర ప్రాంత నగరమైన హైఫాకు సమీపంలో గల ఇజ్రాయిల్ వైమానిక స్థావరంపై శనివారం మధ్యాహ్నం ఫాది–1 రాకెట్లతో దాడి జరిపినట్లు హిజ్బుల్లా వెల్లడించింది. ఒక మసీదులో హిజ్బుల్లా తీవ్రవాదులను బందీగా చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ వెల్లడించింది. బీరుట్ శివార్లలో, ఉత్తర ప్రాంతంలో లక్ష్యాలపై 12సార్లు ఇజ్రాయిల్ విరుచుకుపడింది. మొట్టమొదటిసారిగా ఉత్తర లెబనాన్‌లోని పాలస్తీనా శరణార్థ శిబిరంపై దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లా మౌలిక సౌకర్యాలను ధ్వంసం చేశామని మిలటరీ ఒక ప్రకటనలో తెలిపింది. క్షిపణులను, లాంచ్‌పాడ్‌లను, వాచ్‌టవర్లను, ఆయుధ నిల్వల కేంద్రాలను విధ్వంసం చేశామని వెల్లడించింది. ఇజ్రాయిల్ సరిహద్దు వద్దకు వచ్చేందుకు హిజ్బుల్లా ఉపయోగించే సొరంగాన్ని కూడా పూర్తిగా కూలగొట్టినట్లు తెలిపింది.

గాజాపై దాడుల్లో 9మంది మృతి

సెంట్రల్ గాజా, ఉత్తర గాజా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో ఇద్దరు పిల్లలుసహా తొమ్మిదిమంది మరణించారని పాలస్తీనా మెడికల్ అధికారులు తెలిపారు. ఉత్తర ప్రాంత పట్టణమైన బీట్ హనూన్‌లో ఇద్దరు చిన్నారులతోసహా ఐదుగురూ, నుస్రత్ శరణార్థ శిబిరంలోని ఇంటిపై జరిగిన దాడిలో మరో నలుగురు మరణించారు.

గాజాను వీడి వెళ్లండి : ఇజ్రాయిల్ హుకుం

సెంట్రల్ గాజాను ఖాళీ చేసి వెళ్లిపోవాలని గాజా ప్రజలకు ఇజ్రాయిల్ సైన్యం హుకుం జారీ చేసింది. తాము దాడి చేసే ప్రాంతాల మ్యాప్‌లను కూడా ఆ హెచ్చరికలతో జత చేసింది. ఏడాది కాలంలో దాదాపు 24లక్షల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. 41,825 మంది మరణించారు. వీరిలో అత్యధికులు మహిళలు, పిల్లలే.

ఎక్కడివారక్కడే వుండండి : ఐరాస

దక్షిణ లెబనాన్‌లో శాంతి పరిరక్షకులు ఎక్కడి వారక్కడే వుండాల్సిందిగా ఐక్యరాజ్య సమితి ఆదేశాలు జారీ చేసింది. భూతల దాడులకు దిగుతున్నందున ఇతర ప్రాంతాలకు తరలిపోవాల్సిందిగా ఇజ్రాయిల్ గత నెల 30న ఆదేశించిందని, కానీ తాము ఇక్కడే వున్నామని లెబనాన్‌లో ఐక్యరాజ్య సమితి తాత్కాలిక బలగాలు (యుఎన్ఐఎఫ్ఐఎల్) తెలిపాయి. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే పూర్తి సన్నద్ధంగా వున్నామని తెలిపింది.

గత నెల 23 నుండి లెబనాన్‌లో హిజ్బుల్లా స్థావరాలపై ఉధృతంగా దాడులు జరుపుతూ ఇప్పటికి 1400మందికి పైగా హతమార్చింది. దీంతో వేలాదిమంది ప్రజలు తమ ఇళ్లను వీడి సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్లిపోయారు. 12లక్షలమంది నిర్వాసితులైనట్లు అంచనా. రెండు వారాల్లో దాదాపు 3.75 లక్షల మంది లెబనాన్ నుండి సిరియాలోకి పారిపోయారు.

సరిహద్దు రహదారిపై దాడికి సిరియా ఖండన

సిరియా–లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయిల్ దాడిని సిరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో ఖండించింది. అమాయక పౌరులను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించింది. కీలకమైన మౌలిక సదుపాయాలు, మస్నా క్రాసింగ్ అని పిలువబడే జెడైడాట్ యాబౌస్ క్రాసింగ్‌పైన ఇజ్రాయిల్ బాంబులతో దాడి చేసి పెను విధ్వంసం సృష్టించింది. లెబనాన్ శరణార్థులు, సిరియన్లు ఉపయోగించే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ అంతర్జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. సర్వస్వం కోల్పోయి శరణార్థులుగా మారిన లెబనీస్ పౌరులను ఇజ్రాయిల్‌సైన్యం వెంటాడుతోందని విమర్శించింది.

ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేయాలి : ట్రంప్

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య, లెబనాన్‌పై దాడులకు ప్రతిగా ఇరాన్ క్షిపణి దాడికి సమాధానంగా ఆ దేశ అణు క్షేత్రాలపై ఇజ్రాయిల్ దాడి చేయాలని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను ఇరాన్ సమకూర్చుకోకుండా

హర్మన్‌ప్రీత్ సేనకు క్లిష్ట పరీక్ష

- నేడు పాకిస్తాన్‌తో ఢీ
- గెలిస్తేనే సెమీస్ రేసులో...
- మ.3.30గం॥ల నుంచి



దుబాయ్: ఐసిసి మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారీ అంచనాలతో అడుగిడిన హర్మన్ ప్రీత్ సేనకు తొలి మ్యాచ్‌లోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పటిష్ట న్యూజిలాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో ఏకంగా 58పరుగులు తేడాతో ఓటమిపాలైంది. ప్రతి గ్రూప్‌లో టాప్–2 జట్లు మాత్రమే చేరనున్న క్రమంలో ఈ ఓటమి తీవ్ర ప్రభావాన్ని చూపింది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో తొలుత బౌలర్లు నిరాశపరిచి ధారాళంగా పరుగులు సమర్పించుకున్నా.. ఛేదనలో టీమిండియా కేవలం 102పరుగులకే కుప్పకూలింది. ఒక్కో మ్యాచ్ ముగిసే సరికి గ్రూప్–ఎలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు ప్రత్యర్థులపై గెలిచి మెరుగైన రన్‌రేట్‌తో టాప్‌లో కొనసాగుతుండగా.. తొలి మ్యాచ్‌లోనే ఓడిన టీమిండియా పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉంది. మరోవైపు పాకిస్తాన్ మహిళలు తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై సంచలన విజయం సాధించిన ఉత్సాహంతో టీమిండియాతో పోరుకు సిద్ధమవుతున్నారు. ఇరుజట్లకు ఈ మ్యాచ్ గెలుపు తప్పనిసరి. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో మధ్యాహ్నం 3.30గంటల నుంచి ఈ మ్యాచ్ జరగనుంది.

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మహిళల బోణి

మహిళల టి20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతోపాటు ఇంగ్లండ్ జట్లు బోణీ కొట్టాయి. ఆస్ట్రేలియా జట్టు శ్రీలంకపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించగా.. ఇంగ్లండ్ జట్టు స్వల్ప స్కోర్‌ను కాపాడుకుంటూ 21పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది.

తొలుత ఆస్ట్రేలియా పేసర్ మేఘన్ షట్(3/12), యువ స్పిన్నర్ సోఫీ మొలినెక్స్ (2/20)లు చెలరేగడంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 93పరుగులే చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్ ఓపెనర్ అలీసా హేలీ(4)ని ప్రభోదిని బౌల్డ్ చేసి లంకకు శుభారంభిచ్చింది. అయితే.. బేత్ మూనీ(43 నాటౌట్) ధనాధన్ ఆడి లంకను ఒత్తిడిలోకి నెట్టింది. కానీ, జార్జియా వరేహం(3) రనౌట్ కాగా అలీసా పెర్రీ(17) సైతం స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగింది. 35 పరుగులకే మూడు వికెట్లు పడినా మూనీ జోరు తగ్గించలేదు. ఆల్‌రౌండర్ అష్ గార్డ్‌నర్(12)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పింది. యువకెరటం ఫొబే లిచ్‌ఫీల్డ్(9)తో కలిసి జట్టును విజయ తీరాలకు చేర్చింది.

గ్రూప్–బిలో ఇంగ్లండ్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 118పరుగులే చేసింది. ఇంగ్లండ్ ఓపెనర్లు బౌచర్(23), వాట్(41) రాణించి తొలి వికెట్‌కు 48పరుగులు జతచేశారు. ఆ తర్వాత బ్యాటర్లు నిరాశపరిచారు. ఈ క్రమంలో ఇంగ్లండ్ వరుసగా వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ నైట్(6), బ్రౌంట్(2), కాప్సే(9) ఛార్లీ డీన్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లు ఫాహిమా, నహిదా, రీతుకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ బ్యాటర్లు శోభన(44) పోరాడినా ప్రయోజనం లేకపోయింది. కెప్టెన్ సుల్తానా(15) రెండంకెల డిజిట్‌కు చేరగా.. మిగిలిన బ్యాటర్లు నిరాశపరిచారు. దీంతో బంగ్లాదేశ్ 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 7వికెట్లు కోల్పోయి 97 పరుగులే చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వాట్‌కు దక్కింది.

జట్లు(అంచనా)...

భారత్: షెఫాలీ, స్మృతి మంధాన, హర్మన్ ప్రీత్(కెప్టెన్), రోడ్రిగ్స్, రిచా ఘోష్(వికెట్ కీపర్), పూజ, దీప్తి, అరుంధతి, శోభన, శ్రేయాంక, రేణుక.

పాకిస్తాన్: ఫెరోజా, ఫాతిమా సనా(కెప్టెన్), మునీబా(వికెట్ కీపర్), అమిన్, నిదా ధార్, ఆలీయా రైజ్, సొహైల్, హసన్, సంధు, బేగ్, సదియా.

హర్యానాలో 65 శాతం పోలింగ్

న్యూఢిల్లీ : హర్యానా శాసనసభ ఎన్నికల పోలింగ్ చెదరుమదురు ఘటనలు మినహా శనివారం ప్రశాంతంగా ముగిసింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 65 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం..మేవత్‌లో అత్యధికంగా 68.28 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా గురుగ్రామ్‌లో 49.97 శాతం నమోదైంది. యమునానగర్‌లో 67.93 శాతం, పల్వాల్‌లో 67.69 శాతం, ఫతేహాబాద్‌లో 67.05 శాతం, జింద్‌లో 66.02 శాతం, మహేంద్రగఢ్‌లో 65.76 శాతం, కురుక్షేత్రలో 65.55 శాతం, శీర్సాలో 65.37 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 90అసెంబ్లీ స్థానాల్లో 1031మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో 101 మంది మహిళలు ఉన్నారు. 2 కోట్లకుపైగా ఓటర్లు ఉండగా, 20,629 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఈ నెల 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి మృతి



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గద్దె గాయత్రి (38) గుండెపోటుతో కన్నుమూశారు. శుక్రవారం హఠాత్తుగా గుండెపోటు రావడంతో వెంటనే ఆమెని హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కుమార్తె మరణంతో రాజేంద్ర ప్రసాద్ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. పలువురు సినీ ప్రముఖులు రాజేంద్ర ప్రసాద్‌ను పరామర్శించారు. రాజేంద్ర ప్రసాద్‌కు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

ఎప్పుడూ నవ్వించే అతన్ని ఎలా ఓదార్చాలి.. చిరంజీవి

కుమార్తె వియోగాన్ని తట్టుకొనే శక్తిని రాజేంద్రప్రసాద్‌కి ఇవ్వాలని చిరంజీవి తన సానుభూతి తెలిపారు. 'నా మిత్రుడు రాజేంద్రప్రసాద్ బిడ్డ కాలం చెందటం మనస్తాపానికి గురిచేసింది. వయసు పెరుగుతున్న కొద్దీ పెద్దవాళ్లు ఏమైపోతారో అని చిన్నవాళ్లు ఆలోచిస్తుంటారు. కానీ సగం జీవితం కూడా చూడకుండా చిన్నవాళ్లు ఇలా కనుమరుగైతే పెద్దలకు తట్టుకోలేని బాధగా ఉంటుంది. నా మిత్రుడు ఈ విషాదం నుంచి కోలుకుని త్వరలో మళ్లీ అందరినీ నవ్వించాలి' అని చిరంజీవి మాట్లాడారు.

పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక చర్చల కోసం కాదు : జైశంకర్

న్యూఢిల్లీ : భారత్ –పాకిస్థాన్‌ల మధ్య ద్వైపాక్షిక చర్చల కోసం ఆ దేశం వెళ్లడం లేదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం పేర్కొన్నారు. షాంఘై సహకార కూటమి (ఎస్‌సిఒ) సమావేశంలో పాల్గొనేందుకు మాత్రమే పాకిస్థాన్ వెళుతున్నానని స్పష్టం చేశారు. "నేను బహుళ పాక్షిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నా. భారత్–పాకిస్థాన్ సంబంధాలు గురించి మాట్లాడేందుకు కాదు. ఎస్‌సిఒలో సభ్యుడిగా ఆ దేశంలో పర్యటిస్తున్నా. నేనొక మర్యాదగల పౌరుడిని.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తాను" అని న్యూఢిల్లీలో ఐసి సెంటర్ నిర్వహించిన సర్దార్ పటేల్ లెక్చర్ ఆన్ గవర్నెన్స్‌లో ప్రసంగంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది పాకిస్థాన్‌లో ఎస్‌సిఒ సదస్సు జరుగుతోందని, భారతదేశం మాదదిరిగానే పాకిస్థాన్ కూడా ఆ కూటమిలో సభ్యదేశంగా ఉందని అన్నారు. గతేడాది మేలో గోవాలో జరిగిన ఎస్‌సిఒ సదస్సులో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హాజరయ్యారు. ఆరేళ్ల తర్వాత పాకిస్థాన్ నేత ఒకరు భారత్‌ను సందర్శించడం అదే మొదటిసారి. ఈ నెల 15,16 తేదీలలో జరిగే ఎస్‌సిఒ సదస్సులో పాల్గొనేందుకు జైశంకర్ పాకిస్థాన్ వెళ్లనున్న సంగతి తెలిసిందే.



ఇరానీకప్ విజేత ముంబయి

27ఏళ్ల నిరీక్షణకు తెర • 15వ సారి టైటిల్ కైవసం

లక్నో: అజింక్యా రహానే సారథ్యంలోని ముంబయి జట్టు ఇరానీకప్‌ను చేజిక్కించుకుంది. రంజీ ట్రోఫీ టైటిల్‌ను రికార్డుస్థాయిలో 42 సార్లు చేజిక్కించుకున్న ముంబయి.. 27ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 153పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబయిని తనుష్ కొతియాన్ (114) అజేయ సెంచరీతో చివరి బంతి వరకు క్రీజ్‌లో నిలిచి రెస్టాఫ్ ఇండియా గెలుపు ఆశలపై నీళ్లు చల్లాడు. దీంతో ఐదు రోజుల ఆట ముగిసే సరికి ఫలితం రాక డ్రాగా ముగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన ముంబయిని విజేతగా ప్రకటించారు. సర్ఫరాజ్ ఖాన్(222) డబుల్ సెంచరీతో తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ కొట్టిన ముంబయి ఆ తర్వాత ప్రత్యర్థిని తక్కువకే ఆలౌట్ చేసింది. కీలకమైన రెండో ఇన్నింగ్స్‌లో ముంబయి తడబడింది. తనుష్ పోరాటంతో ఐదో రోజు ఆట ముగిసే సరికి ముంబయి 8 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం కారణంగా ముంబయి చాంపియన్‌గా నిలిచింది.

స్కోర్లు (సంక్షిప్తంగా)...

ముంబయి: 537/10, 329/8 రెస్టాఫ్ ఇండియా: 416/10

నేటినుంచి బంగ్లాదేశ్‌తో తొలి టి20 పోరు

- 14ఏళ్ల తర్వాత గ్వాలియర్‌లో తొలి అంతర్జాతీయ మ్యాచ్
- రాత్రి 7.00గం॥ల నుంచి



గ్వాలియర్: బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా.. ఇక టి20 సిరీస్‌కు సిద్ధమైంది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి టి20 గ్వాలియర్ వేదికగా ఆదివారం జరగనుంది. దాదాపు 14ఏళ్ల తర్వాత గ్వాలియర్ ఒక అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. చివరిసారిగా 2010లో భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఆగ్రా–ముంబయి హైవే రోడ్డుకు సమీపంలో దాదాపు ఆరు ఫ్లడ్‌లైట్లు, ఎనిమిది ఎంట్రీ గేట్లతో నూతనంగా ఈ మైదానానికి తుది మెరుగులు దిద్దారు. దాదాపు 45వేల మంది ప్రత్యక్షంగా మ్యాచ్‌ను వీక్షించే వెసులుబాటు ఉంది. ప్రతి రాష్ట్రంలో క్రికెట్ స్టేడియాలు ఉండాలనే లక్ష్యంతో బిసిసిఐ ఇండోర్‌తోపాటు గ్వాలియర్‌లోనూ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసింది. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి గ్వాలియర్ మైదానాన్ని తీర్చిదిద్దారు. వర్షం ముప్పు ఉన్నప్పటికీ త్వరగా స్టేడియాన్ని సిద్ధం చేయగలమని అధికారులు భరోసా ఇచ్చారు. గ్వాలియర్ వేదికగా చివరిసారిగా 2010లో అంతర్జాతీయ మ్యాచ్ జరిగింది.

జట్లు.. భారత్: సూర్యకుమార్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రింకు సింగ్, సుందర్, బిష్ణోయ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా. **బంగ్లాదేశ్:** నజ్ముల్(కెప్టెన్), తంజిద్, లింటన్ దాస్(వికెట్ కీపర్), తౌహిద్, మహ్మదుల్లా, జాకిర్, మెహిదీ, రిషాద్ హొసైన్, ముస్తాఫిజుర్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్, పర్వేజ్, రోక్సల్ హసన్, షోరిపుల్, మెహిదీ హసన్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68